


# ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక




సంపుటి: 5 సంచిక: 23, పేజీలు - 08

శుక్రవారం, జూన్ 27, 2025 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

EAGLE
Elite Action Group
For Drug Law Enforcement

## తెలంగాణపై ఈగిల్ నిఘా

**- గంజాయి, డ్రగ్స్ పై బ్రహ్మాస్త్రం**

2లో..




## డ్రగ్స్ పై యుద్ధం.. ఎవరు అడ్డొచ్చినా తొక్కుకుంటూ పోతాం

**- గంజాయి, డ్రగ్స్‌పై యుద్ధం ప్రకటిస్తున్నట్లు సీఎం చంద్రబాబు వెల్లడి**

2లో..



## అనంత విశ్వంలో కొత్త గ్రహం


2లో..



## ఉగ్రవాదం-శాంతి ఒకే చోట ఉండవు

**- తేల్చి చెప్పిన రాజ్‌నాథ్ సింగ్**

2లో..



### సంస్థాగత ఎన్నికలతో పార్టీ ప్రక్షాళనకు

# రంగం సిద్ధం

**- రేవంత్ రెడ్డి కొత్త వ్యూహం**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) పార్టీ కోసం పనిచేసిన వారికి మాత్రమే పదవులు వరిస్తాయని మాటలు కాంగ్రెస్ క్షేత్ర స్థాయిలో కూడా అమలు చేసేందుకు తెలంగాణలో కార్యాచరణ రూపొందించింది. పార్టీ మనుగడకు పునాది రాళ్ళుగా నిలిచే కార్యకర్తలకు, నాయకులుగా ఎదిగేందుకు ఇది చక్కటి అవకాశం. ప్రజాస్వామ్య పద్ధతిలో జరిగే ఈ ప్రక్రియతో పార్టీ మరింత బలపడుతుంది. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు, అభివృద్ధిఫలాలు, ప్రజలకు ఒనగూరే ప్రయోజనాలు క్షేత్రస్థాయిలో ఎలుగెత్తిచాటడంలో కార్యకర్తనే ముందుంటాడు. వారి నిర్ణయాలను పరిగణలోకి తీసుకుని పార్టీ సంస్థగత ఎన్నికల్లో పటిష్టమైన నాయకులను ఎన్నుకొని, స్థానిక ఎన్నికల సమరానికి వెళ్లాలనే యోచన మంచిఫలితాలు తెచ్చిపెడుతుందనడంలో సందేహం లేదు.గ్రామంలో సామాన్య కార్యకర్త నుంచి పీసీసీ అధ్యక్షులు, మంత్రులు, ముఖ్యమంత్రి స్థాయి వరకు ఏ పదవి కావాలన్నా, ట్రాక్ రికార్డు ఖచ్చితంగా చూడాలని, పార్టీకి సేవ చేసిన, చేస్తున్న వారికి మాత్రమే పార్టీ, నామినేటెడ్ పదవులు ఇవ్వాలని, వారిని పార్టీ కార్యకర్తలు, ప్రజల సమక్షంలోనే ప్రజాస్వామ్య పద్ధతిలో ఎంపిక చేయాలనే ఆలోచన సరికొత్త అధ్యాయానికి నాంది అని చెప్పుకోవచ్చు. దారిలో పోయే దానయ్యలను పిలిచి పార్టీ పగ్గాలు అప్పగిస్తే పార్టీకి నష్టం వస్తుందని అధిష్టానం గ్రహించింది. గ్రామస్థాయిలో బూత్ నాయకుడైన ప్రజలకు చేదోడు, వాదోడుగా నిలిచే వారు, మంచి, చెడ్డలు పట్టించుకునే వారు నాయకునిగా రూపుదిద్దుకుంటారు. వారికి పార్టీ అవకాశం కల్పించడం వల్ల మరింత ఉత్సాహంగా పనిచేసేందుకు వీలుంటుంది. దీంతో ఆ నాయకుడు బలంగా ఉంటే క్షేత్ర స్థాయిలో పార్టీ బలపడుతుంది.బలమైన పునాదులు ఏర్పరచుకున్న ఏ పార్టీకి అయినా మనుగడకు డోకా లేదని చరిత్ర చెబుతున్నది. ఈ విషయంలో అధినాయకత్వం తీసుకునే నిర్ణయాలు తూచా తప్పకుండా శిరసావహిస్తూ పార్టీని ముందుకు నడపడంలో ప్రతీ కార్యకర్త తన బాధ్యతను గుర్తెరుగుతాడనేది నిర్వివాదాంశం. ఈ ఆలోచనలో శాస్త్రీయత కనిపిస్తోంది. ప్రజల గురించి, ఆయా గ్రామాల అభివృద్ధి గురించి పట్టించుకోకుండా, కేవలం కాంట్రాక్టులు, పైరవీల కోసం మాత్రమే తాపత్రయం పడే వాళ్ళు నాయకులుగా ఎదగడం కష్టమే. వారికి పదవులు వస్తే ఏం చేస్తారో అందరికీ తెలిసిన విషయమే. వారివల్ల పార్టీకి దీర్ఘకాలంలో నష్టం వాటిల్లుతుంది. ఏ నాయకుడి వల్ల ప్రజా ప్రయోజనాలు చేకూరుతాయి అనే దానిని దృష్టిలో పెట్టుకొని, కార్యకర్తల సమక్షంలోనే, వారి సుముఖతతో బాధ్యతలు

2లో..

### పాక్‌కు భారత్

# మరో షాక్

**- తుల్‌బుల్ ప్రాజెక్టుపై కేంద్రం ఫోకస్**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) తరచూ కవ్వింపులకు గురి చేస్తున్న పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పేందుకు భారత్ కఠిన వైఖరి అవలంభిస్తోంది. ఇప్పటికే పహల్గామ్ ఉగ్రదాడిలో 26 మంది అమాయక పర్యాటకుల ప్రాణాలు బలితీసుకున్న పాకిస్తాన్‌ను చావు దెబ్బ కొట్టేందుకు దశాబ్దాల నాటి సింధు నదీ జలాల ఒప్పందాన్ని మోదీ సర్కార్ నిలిపివేసిన సంగతి తెలిసిందే. దీంతో పాకిస్తాన్ ఎడారిలా మారే పరిస్థితి నెలకొంది. తమ గడ్డపై ఉగ్రవాదాన్ని అంతం చేసే వరకు సింధు నదీ జలాల ఒప్పందాన్ని పునరుద్ధరించేది లేదని కేంద్ర ప్రభుత్వం తేల్చి

2లో..

# తిరుపతి, లేపాక్షిలో స్పేస్ సిటీలు

**- రూ. 25,000 కోట్లతో ఏపీ భారీ పాలసీ**

- స్పేస్ పాలసీ 4.0పై సీఎం చంద్రబాబు సమీక్ష
- రూ.25 వేల కోట్ల పెట్టుబడులు ఆకర్షించేలా ఏపీ స్పేస్ పాలసీ
- 2025-35 కాలానికి సంబంధించి స్పేస్ రంగంలో వ్యూహాత్మక లక్ష్యాల నిర్దేశం

2లో..



# డ్రగ్స్ వైపు చూస్తే వెన్ను విరుస్తాం

**- సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర హెచ్చరిక**

- ఐటీ, ఫార్మా హబ్‌గా ఉన్న తెలంగాణ డ్రగ్స్ హబ్‌గా మారితే విఫలమైనట్టేనన్న ముఖ్యమంత్రి
- గంజాయి, డ్రగ్స్ వైపు చూస్తే వెన్ను విరుస్తామని ప్రమాణ స్వీకారం రోజే చెప్పానన్న రేవంత్
- డ్రగ్స్ నివారణకు ప్రత్యేకంగా 'ఈగల్' అనే విభాగం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటన
- విద్యాసంస్థల్లో డ్రగ్స్ కనిపిస్తే యాజమాన్యాలదే బాధ్యత అని స్పష్టం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రం ఐటీ, ఫార్మా రంగాల్లో దేశానికే తలమానికంగా నిలుస్తోందని, అలాంటిది గంజాయి, డ్రగ్స్‌కు అడ్డాగా మారితే అది మనందరి వైఫల్యమే అవుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నాడు మాదాపూర్‌లోని

2లో..

## తెలంగాణ వ్యాప్తంగా ఆర్టీఏ కార్యాలయాల్లో ఏసీబీ సోదాలు

**- అదుపులోకి పలువురు ఏజెంట్లు**

GOVERNMENT OF TELANGANA
ANTI-CORRUPTION BUREAU
HONESTY OBJECTIVITY SINCERITY

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పలు రవాణా శాఖ (ఆర్టీఏ) కార్యాలయాల్లో గురువారం ఉదయం నుంచి అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ నగరంతో పాటు పెద్దపల్లి తదితర జిల్లాల్లోని ఆర్టీఏ కార్యాలయాల్లో ఏకకాలంలో ఈ సోదాలు జరుగుతుండటంతో ఒక్కసారిగా కలకలం రేగింది. అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌లోని కీలక ప్రాంతాలైన ఉప్పల్, తిరుమలగిరి, మన్నెగూడ ఆర్టీఏ కార్యాలయాల్లో ఏసీబీ బృందాలు విస్తృతంగా తనిఖీలు చేపట్టాయి. హైదరాబాద్ ఏసీబీ డీఎస్పీ శ్రీధర్, రంగారెడ్డి జిల్లా డీఎస్పీ ఆనంద్‌ల పర్యవేక్షణలో అధికారులు కార్యాలయాల్లోని రికార్డులను, కీలక పత్రాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. తిరుమలగిరి ఆర్టీఏ కార్యాలయంలో ఏసీబీ అధికారులు

2లో..

# కేసీఆర్ కలలో కూడా తెలంగాణకు నష్టం చేయరు

- సీఎం రేవంత్ రెడ్డికి 'అవినీతి చక్రవర్తి' బిరుదు ఇస్తున్నామని ప్రకటన
- ఏడాదిన్నరలోనే 2 లక్షల కోట్ల అప్పు, ఆ డబ్బు ఏంచేశారని నిలదీసిన ఎమ్మెల్సీ
- చంద్రబాబు, రేవంత్ రెడ్డిల భేటీ తర్వాతే బనకచర్లకు గ్రీన్ సిగ్నల్ వచ్చిందని ఆరోపణ



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** మాజీ ముఖ్యమంత్రి, తన తండ్రి కేసీఆర్ కలలో కూడా తెలంగాణకు నష్టం చేయరని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. తెలంగాణను సస్యశ్యామలం చేసేందుకు

2లో..

# ఉద్యోగులు, పెన్షనర్లకు తెలంగాణ సర్కార్ తీపికబురు

- పాత, కొత్త మెడికల్ బిల్లులకు మోక్షం.. రూ.180 కోట్లు విడుదల
- నిధుల విడుదలకు ఆమోదం తెలిపిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- సుమారు 26,519 మందికి ప్రయోజనం చేకూరనుందని వెల్లడి
- ప్రభుత్వ నిర్ణయంపై ఉద్యోగ, పెన్షనర్ల సంఘాల హర్షం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రేవంత్ సర్కార్ శుభవార్త చెప్పింది. నేడు అనగా గురువారం నాడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించి బకాయి పడ్డ వైద్య బిల్లులను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం రూ.180.38 కోట్ల వైద్య బిల్లుల బకాయిలు చెల్లించినట్లు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల 26,519 మంది ఉద్యోగులు, పెన్షనర్లకు ఊరట లభించింది. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఉద్యోగుల

3లో..

# కూటమి ప్రభుత్వానికి ఆర్థిక క్రమశిక్షణ లోపించింది

- ఏపీ ప్రభుత్వ ఆర్థిక నిర్వహణపై జగన్ ధ్వజం
- రాజ్యాంగ ఉల్లంఘనలంటూ ఆరోపణ
- ఖనిజ సంపద తాకట్టు, సంఘటిత నిధి ప్రైవేటుపరం అంటూ విమర్శలు

**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణను గాలికొదిలేసి, రాజ్యాంగ నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తోందని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ప్రభుత్వ ఆర్థిక విధానాలు, నిధుల సమీకరణ పద్ధతులపై ఆయన పలు ప్రశ్నలు సంధించారు. 2025 జూన్ 25న ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎండీసీ) రెండో విడత నాన్-కన్వర్టబుల్ డిబెంచర్ల (ఎన్‌సీడీలు లేదా బాండ్లు) జారీని పూర్తి చేసిందని, 9.30 శాతం అధిక వడ్డీ (కూపన్) రేటుకు రూ. 5,526 కోట్లు

3లో..



## ఘనంగా పసుపు బోర్డు ప్రారంభోత్సవం

3లో..

**- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడి**



# 35లక్షల పర్యాటకులే టార్గెట్



**- గోదారి ఒడ్డున కీలక ప్రాజెక్ట్ కు శ్రీకారం**

**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఏపీలో 2035 నాటికి 35 లక్షల మంది పర్యాటకుల్ని ఆకర్షించే లక్ష్యంగా రూపుదిద్దుకోనున్న ఓ కీలక ప్రాజెక్టుకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గురువారం శ్రీకారం చుట్టారు. గోదావరి నదీ తీరాన అఖండ గోదావరి పేరుతో, కేంద్ర ప్రభుత్వ నిధులతో రూపుదిద్దుకోనున్న ఈ ప్రాజెక్టుకు కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తో కలిసి పవన్ శంఖుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి ఎంపీ, బీజేపీ ఏపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి కూడా

3లో..

# తెలంగాణపై ఈగిల్ నిఘా

## - గంజాయి, డ్రగ్స్ పై బ్రహ్మాస్త్రం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ప్రభుత్వం మాదక ద్రవ్యాల నిర్మూలన మరియు గంజాయి సాగు, అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవడానికి ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్ఫోర్స్మెంట్ (ఈగిల్) ను ఏర్పాటు చేసింది. ఈ విశేష విభాగం తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో కింద పనిచేస్తుంది. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో ఈగిల్ ఏర్పాటును ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రాన్ని మాదక ద్రవ్యాలు మరియు గంజాయి రహితంగా తీర్చిదిద్దడం, గంజాయి సాగు, అక్రమ రవాణా, మాదక ద్రవ్యాల విక్రయాన్ని నిర్మూలించడం లక్ష్యంగా ఈగిల్ ను ఏర్పాటు చేస్తున్నట్లుగా ప్రకటించారు.

### ఈగిల్ ప్రధాన లక్ష్యాలు

- తెలంగాణ భూభాగంలో గంజాయి మొక్కల సాగును పూర్తిగా అరికట్టడం.
- రాష్ట్ర సరిహద్దులలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను నిరోధించడం.
- విద్యార్థులు, యువత, మరియు సామాన్య ప్రజలలో మాదక ద్రవ్యాల హానికర ప్రభావాలపై అవగాహన కల్పించడం.
- మాదక ద్రవ్యాలకు సంబంధించిన నేరాలపై ఉక్కుపాదం మోపడం, అక్రమ వ్యాపారులు, సరఫరాదారులపై కఠిన చర్యలు తీసుకోవడం.
- రాష్ట్రంలో వ్యసనపరుల కోసం డీ-అడిక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేయడం, రిహాబిలిటేషన్ కార్యక్రమాలను ప్రోత్సహించడం.

ఈ టాస్క్ ఫోర్స్ తెలంగాణ పోలీసు శాఖ, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్, కేంద్ర సంస్థలైన నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరోతో సమన్వయంతో పనిచేస్తుంది. ఈగిల్ టీమ్‌లోని సిబ్బంది కోసం మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఇందులో ఇంటెలిజెన్స్ సేకరణ, దర్యాప్తు వంటి విధానాలు ఉంటాయి. ఈగిల్ ఒక డెడికేటెడ్ వాట్సాప్ నంబర్ (897781972), టోల్-ఫ్రీ హెల్ప్‌లైన్ (1972)ను ప్రవేశపెట్టింది, దీని ద్వారా ప్రజలు మాదక ద్రవ్యాల కార్యకలాపాల గురించి సమాచారాన్ని అందించవచ్చు. మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించడానికి రాష్ట్ర, జిల్లా, మండల, మరియు గ్రామ స్థాయిలో సమావేశాలు, ప్రచార కార్యక్రమాలను నిర్వహించడానికి ప్రణాళికలు రూపొందించారు. పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీలు, గ్రామ సచివాలయాలలో 10 సభ్యులతో కూడిన 'ఈగిల్ కమిటీలు' ఏర్పాటు చేస్తారు.

### డ్రగ్స్ పట్టుబడితే కళాశాల యాజమాన్యంపై కేసులు

మాదక ద్రవ్యాల వినియోగం కేవలం చట్టం ,శాంతిభద్రతల సమస్య కాదు, సామాజిక ముప్పు అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. యువత మాదక ద్రవ్యాలకు బానిస అయితే రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలు విఫలమవుతాయన్నారు. స్కూళ్లలో డ్రగ్స్ పట్టుబడితే యాజమాన్యాలపై కేసులు పెడతామన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా 2024 నవంబర్ 28న ఈగిల్ ను ఏర్పాటు చేసింది, దీని ప్రధాన కార్యాలయం అమరావతిలో ఉంటుంది. ఇది 26 జిల్లాలలో నార్కోటిక్స్ కంట్రోల్ సెల్స్ (డీఎన్సీసీ)ను స్థాపించింది. ఐదు ఫాస్ట్-ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు పంపింది.

# డ్రగ్స్‌పై యుద్ధం..

# ఎవరు అడ్డొచ్చినా తొక్కుకుంటూ పోతాం

## - గంజాయి, డ్రగ్స్‌పై యుద్ధం ప్రకటిస్తున్నట్లు సీఎం చంద్రబాబు వెల్లడి

**అమరావతి (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలో గంజాయి, మాదకద్రవ్యాల మహమ్మారిని కూకటివేళ్లతో పెకిలిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. వీటిపై యుద్ధం ప్రకటిస్తున్నామని, ఈ పోరాటంలో ఎవరు అడ్డువచ్చినా ఉపేక్షించేది లేదని, వారిని తొక్కుకుంటూ ముందుకెళతామని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. గత ప్రభుత్వ హయాంలో గంజాయి నియంత్రణ పూర్తిగా గాలికొదిలేశారని, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాడినందుకు టీడీపీ కార్యాలయంపై దాడులు చేశారని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. యాంటీ నార్కోటిక్స్ డే సందర్భంగా గురువారం నాడు గుంటూరులో నిర్వహించిన వాకథాన్‌లో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. అనంతరం శ్రీకన్వెన్షన్‌లో విద్యార్థులు, యువతతో జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. "రాబోయే రోజుల్లో రాష్ట్రంలో ముఠా కక్షలకు తావులేదు. రాయలసీమలో ఫ్యాక్షనిజాన్ని అణచివేసింది తెలుగుదేశం పార్టీయే. మతసామరస్యాన్ని కాపాడతాం, విద్వేషాలు రెచ్చగొట్టేవారిని ఉపేక్షించం. గంజాయి బ్యాచ్‌కు అండగా నిలిచిన వారికి తగిన గుణపాఠం చెబుతాం" అని సీఎం ఉద్ఘాటించారు.గంజాయి నిర్మూలన కేవలం ప్రభుత్వ బాధ్యతే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా చర్యలు తీసుకోవాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ఈ విషయంలో ప్రతిపక్షాలు కూడా కలిసిరావాలని కోరారు. "ప్రజలను మెప్పించి ఓట్లు వేయించుకోవాలి కానీ, తప్పుడు పనులతో రాజకీయ లబ్ధి పొందాలనుకుంటే కుదరదు. 2021లో దేశవ్యాప్తంగా పండిన మొత్తం గంజాయిలో 50 శాతం ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల నుంచే ఉత్పత్తి కావడం, దానికి విశాఖపట్నం కేంద్రంగా మారడం తీవ్ర ఆవేదన కలిగించింది" అని ఆయన అన్నారు. గంజాయికి బానిసలవడం వల్ల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయని, యువత అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ విలువైన జీవితాలను నాశనం చేసుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్నిచోట్ల మెడికల్ షాపుల్లో కూడా మత్తుపదార్థాలు అమ్ముతున్నారన్న సమాచారం ఉందని తెలిపారు. "గంజాయిపై రాష్ట్రవ్యాప్తంగా 'ఈగల్' పేరుతో డేగ కన్ను వేసి ఉంచుతాం. ఇప్పటికైనా మారకపోతే అలాంటి వారు రాష్ట్రంలో ఉండేందుకే అనర్హులు. ఎవరైనా ఆడబిడ్డల జోలికి వస్తే, అదే వారికి చివరి రోజు అవుతుంది" అని తీవ్రంగా హెచ్చరించారు.మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరిస్తూ, "రాష్ట్రంలోని 26 జిల్లాల్లో నార్కోటిక్స్ సెల్స్ ఏర్పాటు చేశాం. పాఠశాలల్లో ఈగల్ క్లబ్‌లు నెలకొల్పాం. ఎక్కడైనా ఇబ్బంది ఉంటే '1972' నంబర్‌కు మెసేజ్ పంపితే తక్షణమే రక్షణ చర్యలు తీసుకుంటాం. మద్యం ద్వారా వచ్చే ఆదాయంలో 2 శాతాన్ని డ్రగ్స్ నిర్మూలన కార్యక్రమాలకు కేటాయిస్తాం. రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో 56 డీ-అడిక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేస్తాం" అని చంద్రబాబు ప్రకటించారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విస్తృత ప్రచారం నిర్వహించేందుకు సినీనటులు కూడా ముందుకు రావాలని, ప్రజా చైతన్యం కోసం కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఉగ్రవాదం-శాంతి ఒకే చోట ఉండవు

## - తేల్చి చెప్పిన రాజ్‌నాథ్ సింగ్

బీజింగ్ (ప్రశ్న న్యూస్) ఉగ్రవాదం, అణ్వాయుధాల వ్యాప్తి వంటి పెను సవాళ్లను ఎదుర్కోవడానికి షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సభ్య దేశాలన్నీ కలిసికట్టుగా, నిర్ణయాత్మకంగా ముందుకు సాగాలని భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. చైనాలోని కింగ్‌డావో నగరంలో జరిగిన ఎస్‌సీవో రక్షణ మంత్రుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఉగ్రవాదం ఉన్నచోట శాంతి, శ్రేయస్సు మనుగడ సాగించలేవని స్పష్టం చేశారు. రాడికలైజేషన్, తీవ్రవాదం, పరస్పర విశ్వాస లోపం వంటివి ఈ ప్రాంతం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాళ్లని ఆయన నొక్కిచెప్పారు. ఉగ్రవాదాన్ని తమ స్వార్థ ప్రయోజనాల కోసం ప్రోత్సహించే, పెంచి పోషించే శక్తులు కచ్చితంగా తగిన పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని రాజ్‌నాథ్ హెచ్చరించారు. "కొన్ని దేశాలు సరిహద్దు ఉగ్రవాదాన్ని తమ విధానపరమైన ఆయుధంగా వాడుకుంటూ ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తున్నాయి. ఇలాంటి ద్వంద్వ ప్రమాణాలకు తావుండకూడదు. అలాంటి దేశాలను విమర్శించడానికి ఎస్‌సీవో వెనుకాడకూడదు" అని ఘాటుగా వ్యాఖ్యానించారు.దఉగ్రవాదం విషయంలో భారత్ ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీపడబోదని (జీరో టాలరెన్స్) రాజ్‌నాథ్ సింగ్ పునరుద్ఘాటించారు. ఉగ్రవాదం నుంచి తమను తాము రక్షించుకునే హక్కు ఇందులో భాగమేనని పేర్కొన్నారు. ఉగ్రవాద కేంద్రాలు ఇకపై సురక్షితం కావని, వాటిని లక్ష్యంగా చేసుకోవడానికి వెనుకాడబోమని తాము నిరూపించామని అన్నారు. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత సరిహద్దు ఉగ్రవాద మౌలిక సదుపాయాలను ధ్వంసం చేయడానికి మే 7న 'ఆపరేషన్ సింధూర్'ను విజయవంతంగా చేపట్టామని వివరించారు.

యువత రాడికలైజేషన్ బారిన పడకుండా నిరోధించడానికి ప్రపంచవ్యాప్త చర్యలు అవసరమని రాజ్‌నాథ్ సింగ్ నొక్కిచెప్పారు. ఎస్‌సీవో ప్రాంతీయ ఉగ్రవాద వ్యతిరేక విభాగం (రాట్స్) ఈ దిశగా సమన్వయంతో కీలక పాత్ర పోషిస్తోందని ప్రశంసించారు. ఉగ్రవాదం, వేర్పాటువాదం, తీవ్రవాదానికి దారితీసే రాడికలైజేషన్‌ను ఎదుర్కోవడంపై భారత్ అధ్యక్షతన జరిగిన ఎస్‌సీవో దేశాధినేతల మండలి సమావేశంలో జారీ చేసిన సంయుక్త ప్రకటన సంస్థ భాగస్వామ్య నిబద్ధతను ప్రతిబింబిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఆయుధాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు ఉగ్రవాదులు డ్రోన్ల వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడాన్ని అరికట్టాలని సభ్య దేశాలకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఎంత పెద్ద, శక్తివంతమైన దేశమైనా ఒంటరిగా సమస్యలను పరిష్కరించుకోలేదని చెబుతూ, 'సర్వే జనా సుఖినో భవంతు' (ప్రజలందరూ సంతోషంగా ఉండాలి) అనే ప్రాచీన భారతీయ తత్వాన్ని ఉటంకించారు. అఫ్ఘానిస్థాన్‌లో శాంతి, స్థిరత్వానికి భారత్ స్థిరంగా మద్దతు ఇస్తుందని రక్షణ మంత్రి పునరుద్ఘాటించారు. ఎస్‌సీవో సభ్యుల మధ్య మరింత సహకారం, పరస్పర విశ్వాసం ఉండాలని పిలుపునిస్తూ రాజ్‌నాథ్ సింగ్ తన ప్రసంగాన్ని ముగించారు.

# అనంత విశ్వంలో కొత్త గ్రహం

## - జేమ్స్ వెబ్ టెలిస్కోప్ తో గుర్తించిన నాసా

**వాషింగ్టన్ (ప్రశ్న న్యూస్)** అంతరిక్ష పరిశోధనల్లో సరికొత్త అధ్యాయాన్ని ఆవిష్కరిస్తూ, నాసాకు చెందిన ప్రఖ్యాత జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోప్ (జేమ్స్ వెబ్) ఒక చారిత్రాత్మక విజయాన్ని సొంతం చేసుకుంది. సౌర కుటుంబం వెలుపల గ్రహాలపై పరిశోధనలు ప్రారంభించిన మూడేళ్ల అనంతరం, తొలిసారిగా ఓ సరికొత్త గ్రహాన్ని స్వయంగా గుర్తించి, ఖగోళ శాస్త్రంలో తనదైన ముద్ర వేసింది.

### బుల్లి గ్రహం 'టీడబ్ల్యూఏ 7బి' ఆవిష్కరణ

జేమ్స్ వెబ్ ద్వారా ఆవిష్కృతమైన ఈ నూతన గ్రహానికి శాస్త్రవేత్తలు 'టీడబ్ల్యూఏ 7బి' అని నామకరణం చేశారు. ఇప్పటివరకు ప్రత్యక్షంగా చిత్రీకరించిన పరాయి గ్రహాల్లో ఇదే అత్యంత తక్కువ ద్రవ్యరాశి కలిగినది కావడం గమనార్హం. దీని బరువు మన సౌర కుటుంబంలోని గురు గ్రహంతో పోలిస్తే కేవలం 0.3 రెట్లు (భూమి కన్నా సుమారు 100 రెట్లు ఎక్కువ) మాత్రమే ఉంటుందని, గతంలో కనుగొన్న ఇలాంటి గ్రహాల కన్నా ఇది పది రెట్లు తేలికైనదని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. ఈ బుల్లి గ్రహం, భూమి నుంచి సుమారు 111 కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న 'సీఈ యాంట్లియే' (టీడబ్ల్యూఏ 7) అనే అతి పిన్న వయసు నక్షత్రం చుట్టూ పరిభ్రమిస్తోంది. ఈ నక్షత్రం వయసు కేవలం 64 లక్షల సంవత్సరాలు మాత్రమే.

### ఇన్‌ఫ్రారెడ్ కెమెరాల మాయాజాలం

'టీడబ్ల్యూఏ 7బి' గ్రహాన్ని దాని మాతృ నక్షత్రమైన సీఈ యాంట్లియే చుట్టూ ఆవరించి ఉన్న ధూళి, శిథిలాల వలయంలో (డెబ్రీస్ డిస్క్) జేమ్స్ వెబ్ అత్యంత చాకచక్యంగా గుర్తించింది. టెలిస్కోప్‌లో అమర్చిన శక్తివంతమైన మిడ్-ఇన్‌ఫ్రారెడ్ ఇన్‌స్ట్రుమెంట్ (ఎంఐఆర్ఐ) మరియు దాని కరోనాగ్రాఫ్ ఈ ఆవిష్కరణలో కీలక పాత్ర పోషించాయి. కరోనాగ్రాఫ్ సహాయంతో నక్షత్రం నుంచి వెలువడే ప్రకాశవంతమైన కాంతిని నిరోధించి, దాని సమీపంలో పరిభ్రమిస్తున్న మసకబారిన గ్రహాన్ని విజయవంతంగా చిత్రీకరించారు. ధూళి వలయంలోని ఖాళీ ప్రదేశంలో ఈ గ్రహం ఉనికిని కనుగొనడం విశేషం.

### గ్రహాల ఏర్పాటుపై నూతన వెలుగులు

ఈ ఆవిష్కరణ గ్రహాల ఏర్పాటు, పరిణామ క్రమంపై ఇప్పటికే ఉన్న సిద్ధాంతాలకు మరిన్ని కీలక ఆధారాలను అందిస్తుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ముఖ్యంగా, యువ నక్షత్రాల చుట్టూ గ్రహాలు ఎలా ఏర్పడతాయో అర్థం చేసుకోవడానికి 'టీడబ్ల్యూఏ 7బి' ఒక ముఖ్యమైన కేస్ స్టడీగా ఉపయోగపడుతుంది. అత్యంత తక్కువ ద్రవ్యరాశి కలిగిన గ్రహాలను కూడా గుర్తించగల జేమ్స్ వెబ్ అమోఘమైన సామర్థ్యం, భవిష్యత్తులో మరిన్ని అద్భుతమైన ఆవిష్కరణలకు బాటలు వేస్తుందని పరిశోధకులు ప్రగాఢ విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిశోధన ద్వారా గ్రహాలు, వాటి చుట్టూ ఉండే ధూళి వలయాల మధ్య ఉండే సంక్లిష్టమైన సంబంధాన్ని మరింత లోతుగా అధ్యయనం చేసేందుకు వీలు కలుగుతుంది.

# తిరుపతి, లేపాక్షిలో స్పేస్ సిటీలు

అమరావతి (ప్రశ్న న్యూస్) స్పేస్ రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రపథాన నిలపడంతో పాటు, రూ.25 వేల కోట్ల పెట్టుబడులు ఆకర్షించేలా ఆంధ్రప్రదేశ్ స్పేస్ పాలసీ 4.0ని తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. పెట్టుబడుల లక్ష్యం నెరవేరితే ప్రత్యక్షంగా 5 వేల మందికి, పరోక్షంగా 30 వేల మందికి ఉపాధి కలుగుతుందని అన్నారు. లేపాక్షి, తిరుపతిలో స్పేస్ సిటీల ఏర్పాటుకు ఆమోదం తెలిపిన ముఖ్యమంత్రి 2025-35 కాలానికి సంబంధించి స్పేస్ రంగంలో వ్యూహాత్మక లక్ష్యాలను నిర్దేశించారు. గురువారం ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ స్పేస్ పాలసీ 4.0పై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. విద్యాసంస్థలను ఇందులో భాగస్వాములు చేయడం ద్వారా విద్యార్థులు ఈ రంగం వైపు ఆకర్షితులు అయ్యేలా చూడాలని ముఖ్యమంత్రి అన్నారు. అలాగే ప్లగ్ అండ్ ప్లే విధానంలో వినియోగించుకునేలా కామన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కల్పించాలని, ఇందుకోసం టెక్నికల్ కమిటీ నియమించాలని ఆదేశించారు. కమ్యునికేషన్ రంగంలో అగ్రస్థానంలో ఉన్న సంస్థలను ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆహ్వానించాలని చెప్పారు. ఎలక్ట్రానిక్స్, స్పేస్, ఏరోస్పేస్, డిఫెన్స్, డ్రోన్లకు సంబంధించి టెక్నాలజీ అనుసంధానం జరగాల్సి ఉందని ముఖ్యమంత్రి అన్నారు.

### భవిష్యత్ అంతా స్పేస్ రంగానిదే

సమీక్షలో ఆంధ్రప్రదేశ్ స్పేస్ టెక్నాలజీ గౌరవ సలహాదారు, ఇస్రో మాజీ చైర్మన్ సోమనాథ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. స్పేస్ విజన్ పాలసీ-2047 కింద కేంద్ర ప్రభుత్వం పలు కీలక ప్రాజెక్టులు చేపడుతోందని అలాగే స్టార్ లింక్, స్పేస్ ఎక్స్, బ్లూ ఆరిజన్ వంటి ప్రైవేట్ ఆపరేటర్లు ఈ రంగంలో సంచలనాలు సృష్టిస్తున్నారని భవిష్యత్ అంతా స్పేస్ రంగానిదేనని సోమనాథ్ ముఖ్యమంత్రికి తెలిపారు.

### 45 శాతం వరకు రాయితీలకు ప్రతిపాదనలు

స్పేస్ రంగంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే సంస్థలకు మరింత మెరుగ్గా పెట్టుబడి రాయితీ ఇవ్వాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. రూ.కోటి నుంచి రూ.2.5 కోట్ల వరకు మైక్రో, రూ.2.5 కోట్ల నుంచి రూ.25 కోట్ల వరకు స్మాల్, రూ.25 కోట్ల నుంచి రూ.125 కోట్ల వరకు మీడియం, రూ.125 కోట్ల నుంచి రూ.500 కోట్ల వరకు లార్జ్ కేటగిరీలుగా పెట్టుబడులను విభజించారు. రూ.500 కన్నా ఎక్కువ పెట్టుబడులను మెగా కేటగిరీ కింద పరిగణిస్తారు. 25 శాతం నుంచి 45 శాతం వరకు పెట్టుబడి రాయితీ ఇచ్చేలా ప్రతిపాదనలను అధికారులు ముఖ్యమంత్రి ముందుంచారు. అలాగే ఇందులో మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించే అంశంపైనా సమీక్షలో చర్చించారు.

### లేపాక్షిలో టెక్నాలజీ స్పేస్ సిటీ

రాష్ట్రంలో రెండు స్పేస్ సిటీలు నిర్మించాలని కొత్త పాలసీలో నిర్దేశించారు. 500 ఎకరాల్లో ఏర్పాటు కానున్న లేపాక్షి స్పేస్ సిటీలో డిజైన్ అండ్ డెవలప్మెంట్‌కు ప్రాధానత్య ఇస్తారు. ఆర్ అండ్ డి, స్పేస్ స్టార్ట్ అప్, ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్, స్పేస్ అప్లికేషన్లు-సేవలకు సంబంధించి సంస్థలు ఏర్పాటు కానున్నాయి.

### తిరుపతిలో మాన్యుఫాక్చరింగ్ స్పేస్ సిటీ

తిరుపతి స్పేస్ సిటీని మాన్యుఫ్యాక్చరింగ్, లాంచ్ లాజిస్టిక్ సేవలు అందించే సంస్థల ఏర్పాటుకు కేటాయించారు. ఇక్కడ లాంచ్ వెహికల్ అసెంబ్లీ, శాటిలైట్-పేలోడ్ అసెంబ్లీ, మెకానికల్ సిస్టమ్-కాంపొనెంట్ మాన్యుఫాక్చరింగ్, ఎలక్ట్రానిక్-ఏవియానిక్స్ అసెంబ్లీ సంస్థలకే ఈ సిటీలో అవకాశం కల్పిస్తారు. బెంగళూరుకు సమీపంలో లేపాక్షి స్పేస్ సిటీ, శ్రీహరికోట - చెన్నయ్‌కు సమీపంలో తిరుపతి స్పేస్ సిటీ ఉండటం కలిసొచ్చే అంశం. తిరుపతి స్పేస్ సిటీ నుంచి %-% శ్రీహరికోటకు రోడ్ కనెక్టవిటీపైనా ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు.

### గ్లోబల్ స్పేస్ ఎకానమీలో 2 శాతం వాటా

గ్లోబల్ స్పేస్ ఎకానమీలో ప్రస్తుతం భారతదేశం కేవలం 2 శాతం వాటా కలిగి ఉంది. ఈరంగంలో 2033 నాటికి 44 బిలియన్ డాలర్ల పెట్టుబడుల సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇండియా స్పేస్ పాలసీ-2023, 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అనుమతిస్తోంది. ఇండియా స్పేస్ విజన్-2047 కింద శాటిలైట్ల తయారీ, రిమోట్ సెన్సింగ్ శాటిలైట్ల లాంచింగ్, చంద్రయాన్ 4, వీనస్ ఆర్బిటరీ మిషన్, మార్స్ ల్యాండర్ మిషన్, హ్యూమన్ స్పేస్ ఫ్లయిట్-స్పేస్ స్టేషన్, నెక్ట్స్ జెనరేషన్ లాంచ్ వెహికల్, శ్రీహరికోటలో 3వ లాంచ్ ప్యాడ్ నిర్మాణం వంటివి లక్ష్యాలు. 2040 కల్లా చంద్రుడిపై మనిషి అడుగుపెట్టాలనేది ఆశయం. కేంద్ర లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం 'ఆంధ్రప్రదేశ్ స్పేస్ పాలసీ 4.0'ను రూపొందిస్తోంది.

# టీటీడీ ఉద్యోగులకు 2వేల హెల్మెట్లు పంపిణీ



**తిరుమల :** టీటీడీ ఉద్యోగులకు టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు తిరుమలలోని చైర్మన్ క్యాంపు కార్యాలయంలో సీవీఎస్వో మురళీకృష్ణ తో కలిసి గురువారం హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ టీటీడీ ఉద్యోగుల భద్రతను దృష్టిలో ఉంచుకుని హెల్మెట్ల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని చెప్పారు.

ఇటీవలే 500 హెల్మెట్లు పంపిణీ చేశామని, అమాలాపురానికి చెందిన శ్రీ నిమ్మకాయల సత్యనారాయణ, హైదరాబాద్ కు చెందిన శ్రీ నాగేంద్ర ప్రసాద్ అనే దాతలు విరాళంగా ఇచ్చిన 2 వేల హెల్మెట్లు ప్రస్తుతం పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో మరో 7500 హెల్మెట్లు టీటీడీ ఉద్యోగులకు అందిస్తామని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్లు ధరించాలని ఆయన కోరారు.

# సంస్థాగత ఎన్నికలతో పార్టీ ప్రక్షాళనకు రంగం సిద్ధం

అప్పగిస్తే పార్టీకి మంచిది.కార్యకర్త నుంచి నాయకులుగా ఎదిగిన వారందరూ ఆయా గ్రామాల్లో, మండలాల్లో ప్రజలకు చేరువగా ఉంటూ, వారి సమస్యలను తన స్థాయిలో పరిష్కరిస్తూ, వారిలో మమేకమై ఉన్నప్పుడే వారికి అవకాశాలు వస్తాయి. ఆ అవకాశాలను అందిపుచ్చుకొని మరింత సేవ చేసేందుకు ప్రయత్నించాలి. ప్రధానంగా ప్రభుత్వం లో ఉన్న పార్టీ ఇలాంటి విషయాలను పరిగణలోకి తీసుకోకుండా వ్యవహరిస్తుంది. అధికారంలో ఉన్నాం, తాము ఏం చేసినా చెల్లుతుందని ధోరణితో ఉంటే పార్టీ మనుగడపై దీర్ఘకాలంలో ప్రభావం చూపుతుంది. పార్టీ పునాదులు కదులుతాయి, మళ్లీ ప్రభుత్వం అధికారంలోకి రావడం కష్టసాధ్యం అవుతుంది. అలాంటి పరిస్థితి రాకుండా ఉండాలంటే కిందిస్థాయి నుంచి ప్రక్షాళన అవసరమే. గ్రామాల్లో పార్టీ పేరు చెప్పుకొని, అధికారంలో ఈ పార్టీ ఉంటే ఆ పార్టీ మాదే అని రంగులు మార్చే ఫైరవీకారులు, కాంట్రాక్టర్లు, స్వయంప్రకటిత నాయకులుగా చలామణి అవుతున్న వారికి కాకుండా నిజమైన కార్యకర్తలకు అవకాశం వస్తుంది. ఈ ప్రక్రియ సజావుగా జరిగితే ఏ పార్టీకైనా మంచి భవిష్యత్ ఉంటుందనడంలో సందేహం లేదు.

# పాక్‌కు భారత్ మరో షాక్

చెప్పేసింది. ఈ నేపథ్యంలోనే సింధు నదీ జలాలను పాకిస్తాన్‌కు వెళ్లకుండా అడ్డుకున్న భారత్, వాటిని వినియోగించుకునేందుకు తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. పశ్చిమం వైపు ప్రవహిస్తున్న నదుల నుంచి నీటిని మరింత సద్వినియోగం చేసుకునేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఈ క్రమంలోనే సుదీర్ఘకాలంగా నిలిచిపోయిన తుల్‌బుల్ నావిగేషన్ ప్రాజెక్టును మళ్లీ పట్టాలెక్కించేందుకు కేంద్రం దృష్టి పెట్టినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.ఈ తుల్‌బుల్ నావిగేషన్ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లే ప్రక్రియ తుది దశలో ఉందని అధికారిక వర్గాలు చెబుతున్నాయి. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ సిద్ధం అవుతోందని సంవత్సరం లోగా పూర్తయ్యే అవకాశం ఉందని తెలిపారు. పశ్చిమ నదుల వాటాను మరింత సద్వినియోగం చేసుకునేందుకు అనేక ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయని సంబంధిత అధికారి ఒకరు స్పష్టం చేశారు. పశ్చిమ దిశగా ప్రవహించే నదుల్లో ఒకదాని నుంచి నీటిని పంజాబ్, హరియాణా రాష్ట్రాలకు మళ్లించే అవకాశం కూడా పరిశీలనలో ఉందని తెలిపారు.

### సింధు జలాల ఒప్పందం , భారత్‌కు సవాళ్లు

1960 సెప్టెంబరు 19వ తేదీన భారత్, పాక్‌ల మధ్య కుదిరిన సింధు జలాల ఒప్పందం ప్రకారం పశ్చిమ దిశగా పాకిస్తాన్ వైపు ప్రవహించే సింధూ నదితోపాటు చీనాబ్, జీలం వంటి ప్రధాన ఉప నదులపై భారత్‌కు తక్కువ అధికారాలు మాత్రమే ఉన్నాయి. ఈ నదీ వ్యవస్థ మొత్తం నీటిలో 20 శాతం భారత్, 80 శాతం పాకిస్తాన్ వినియోగించుకోవాలని తీర్మానించారు. అయితే మన దేశంలో ఈ నదుల నీటి నిల్వ సామర్థ్యం తక్కువగా ఉండటం భారత్‌కు అతిపెద్ద సవాలుగా మారింది. వేసవి కాలంలో కొంతమేరకు నిల్వ చేస్తున్నప్పటికీ, వర్షాకాలంలో నిల్వ సామర్థ్యం తక్కువగా ఉండటంతో అధిక నీరు దిగువన ఉన్న పాకిస్తాన్‌కే ప్రవహిస్తోందని అధికారులు పేర్కొన్నారు. అంతేకాకుండా సింధు జలాల ఒప్పందం అమలు వల్ల వరదలు వచ్చిన సమయాల్లో కొన్ని సవాళ్లు ఎదురయ్యేవని కానీ ప్రస్తుతం రిజర్వాయర్ నిర్వహణపై ప్రముఖంగా దృష్టి సారించినట్లు తెలిపారు. గతంలో పాక్ తీవ్రంగా వ్యతిరేకించిన కిషన్‌గంగా ప్రాజెక్టు ఇప్పటికే పూర్తికాగా రాట్లే ప్రాజెక్టు నిర్మాణం కూడా ముమ్మరంగా కొనసాగుతోందని అధికారులు స్పష్టం చేశారు.

# డ్రగ్స్ వైపు చూస్తే వెన్ను విరుస్తాం

శిల్పకళా వేదికలో నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తాను ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రోజే డ్రగ్స్ మాఫియాకు గట్టి హెచ్చరిక చేశానని, తెలంగాణ గడ్డపై గంజాయి, డ్రగ్స్ వైపు కన్నెత్తి చూసినా వారి వెన్ను విరుస్తామని స్పష్టం చేశానని ఈ సందర్భంగా గుర్తుచేశారు. "తెలంగాణ అంటేనే ఉద్యమాలు, పోరాటాలకు పురిటిగడ్డ. అలాంటి గడ్డ డ్రగ్స్‌కు నిలయంగా మారితే అది రాష్ట్రానికే అవమానకరం" అని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు.పాఠశాలల నుంచి విశ్వవిద్యాలయాల వరకు విద్యార్థులు డ్రగ్స్ మహమ్మారి కోరల్లో చిక్కుకుంటున్నారని, ఇది దేశ భవిష్యత్తుకే ప్రమాదకరమని హెచ్చరించారు. శత్రుదేశాలు ఒక దేశాన్ని దెబ్బతీయడానికి ఎలాంటి మార్గాలైనా ఎంచుకోవచ్చని, కొవిడ్ లాంటి వైరస్‌లను లేదా డ్రగ్స్‌ను కూడా ప్రయోగించవచ్చని అభిప్రాయపడ్డారు. మాదకద్రవ్యాలు రవాణా చేసే వారు తెలంగాణ సరిహద్దుల్లోకి అడుగుపెట్టాలంటేనే వణికిపోయేలా కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రులకు, పోలీసు ఉన్నతాధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఒకప్పుడు యుద్ధాలు, సైనికులు అనగానే పంజాబ్ రాష్ట్రం గుర్తుకు వచ్చేదని, అలాంటి పంజాబ్ ఇప్పుడు డ్రగ్స్ మహమ్మారి కోరల్లో చిక్కుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్ నివారణలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. యువతను సరైన మార్గంలో నడిపించి, అభివృద్ధి పథంలోకి తీసుకురావాలనే లక్ష్యంతోనే కొత్త స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చామని తెలిపారు. 140 కోట్ల జనాభా ఉన్న మన దేశానికి ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకాలు రాకపోవడంపై ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. యువతకు సాంకేతిక నైపుణ్యాలు అందించేందుకు 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ'ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.డ్రగ్స్ నిర్మూలన కేవలం ప్రభుత్వ బాధ్యతే కాదని, పౌరులు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పాఠశాలల్లో పిల్లల ప్రవర్తనను గమనించేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. సబ్జెక్టు టీచర్లు, పీఈటీలతో పాటు 'బిహేవియర్ అబ్జర్వర్స్'ను కూడా నియమించుకోవాలని యాజమాన్యాలకు సూచించారు. చాక్లెట్లు, ఐస్‌క్రీమ్‌ల రూపంలో కూడా గంజాయి, డ్రగ్స్‌ను విక్రయిస్తున్నారని, ఇలాంటి సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. విద్యాసంస్థల ప్రాంగణాల్లో డ్రగ్స్ దొరికితే సంబంధిత యాజమాన్యాలదే పూర్తి బాధ్యత అన్నారు. గంజాయి సాగు, సరఫరా, విక్రయాలపై ఉక్కుపాదం మోపేందుకు ప్రత్యేకంగా 'ఈగల్' అనే విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ 'ఈగల్' బృందం నిరంతరం నిఘా పెడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సినీనటులు రామ్‌చరణ్, విజయ్‌దేవరకొండ పాల్గొనడంపై ముఖ్యమంత్రి స్పందిస్తూ "ఎంత బిజీగా ఉన్నప్పటికీ, యువతకు మంచి సందేశం ఇవ్వాలనే తపనతో, ఈ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలవాలనే ఆకాంక్షతో వారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు" అని అన్నారు. ఈ సదస్సులో నిర్మాత దిల్‌రాజు, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్, పలువురు ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ వ్యాప్తంగా ఆర్టీఏ కార్యాలయాల్లో ఏసీబీ సోదాలు

ఇద్దరు క్లర్క్‌లతో పాటు కార్యాలయం వద్ద తిష్టవేసిన 10 మంది ఏజెంట్లను అదుపులోకి తీసుకున్నారు. కార్యాలయం తలుపులు మూసివేసి, బయటి వ్యక్తుల ప్రవేశాన్ని నిలిపివేసి అధికారులు సోదాలు కొనసాగిస్తున్నారు. అదేవిధంగా, ఉప్పల్ ఆర్టీఏ కార్యాలయంలో కూడా ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించి, సుమారు 10 మంది ఏజెంట్లను అదుపులోకి తీసుకున్నారు.

# కేసీఆర్ కలలో కూడా తెలంగాణకు నష్టం చేయరు

కేసీఆర్ ప్రాజెక్టులు నిర్మించారని, ఇందుకోసం ఆయన అప్పులు చేశారని, ఆ అప్పులను తన హయాంలోనే తిరిగి చెల్లించారని ఆమె తెలిపారు. గురువారం ఉదయం జూబ్లీహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే రూ.2 లక్షల కోట్ల మేర అప్పు చేసిందని కవిత ఆరోపించారు. ఇంత భారీగా అప్పులు చేసినా సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని, మరి ఆ డబ్బంతా ఏమైందని ప్రభుత్వాన్ని నిలదీశారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డి భేటీ జరిగిన తర్వాతే ఏపీలోని బనకచర్ల ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ వచ్చిందని కవిత ఆరోపించారు. చంద్రబాబుకు వ్యతిరేకంగా మాట్లాడేందుకు భయపడి బనకచర్ల విషయంలో సీఎం రేవంత్ రెడ్డి మౌనం వహిస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్ బిర్యానీ తినిపించి బనకచర్ల నీళ్లను చంద్రబాబుకు అప్పగిస్తున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

కేసీఆర్ గతంలోనే "ఆంధ్రా బిర్యానీ" గురించి చెప్పారని గుర్తుచేశారు. బనకచర్ల ప్రాజెక్టు ద్వారా మెగా కంపెనీకి లబ్ధి చేకూర్చేందుకే దీనిని నిర్మిస్తున్నారని కవిత మండిపడ్డారు. ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఆంధ్రాలో మేధావులు కూడా సమావేశమయ్యారని కవిత తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డికి "అవినీతి చక్రవర్తి" అనే బిరుదు ఇస్తున్నామని, ఆయన అవినీతిపై జాగృతి ఆధ్వర్యంలో ఒక బుక్‌లెట్ ప్రచురించి రాష్ట్రవ్యాప్తంగా పంచుతామని కవిత ప్రకటించారు. 18 నెలల పాలనలో రెండు లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేసిన సీఎం రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతూ, ఈ అప్పులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తాము తెచ్చిన అప్పులతో కేసీఆర్ చేసిన అప్పులకు వడ్డీ కడుతున్నామని సీఎం అంటున్నారని, కానీ రెండు లక్షల కోట్లు అప్పు చేసినా పింఛన్లు, మహాలక్ష్మి పథకం సరిగా అమలు కావడం లేదని విమర్శించారు. కేసీఆర్ ఆర్‌ఈసీ వద్ద అప్పులు తెచ్చి ప్రాజెక్టులు కట్టారని, ఆ అప్పులను తిరిగి చెల్లించారని, ఆర్‌ఈసీ సంస్థ కేసీఆర్ ప్రభుత్వానికి 'ఏ' గ్రేడ్ ఇచ్చిందని గుర్తు చేశారు.

ప్రస్తుత ప్రభుత్వం ఆర్‌ఈసీకి కట్టాల్సిన రూ.1,320 కోట్లను జూన్ 28 లోపు చెల్లించాలని, లేకపోతే రాష్ట్రాన్ని డిఫాల్ట్‌గా ప్రకటిస్తామని ఆర్‌ఈసీ లేఖ రాసిందని కవిత పేర్కొన్నారు.కేంద్ర ప్రభుత్వం ప్రగతి అజెండా నుంచి పోలవరం ప్రాజెక్టు చర్చను తొలగించిందని కవిత విమర్శించారు. భద్రాచలం రాముడు ముంపునకు గురవుతున్నా, తెలంగాణలోని 8 మంది బీజేపీ ఎంపీలు నోరు మెదపడం లేదని దుయ్యబట్టారు. భద్రాచలం వద్ద ఉన్న ఐదు గ్రామ పంచాయతీలను తెలంగాణలో కలపాలని డిమాండ్ చేశారు. కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను మెగా, పొంగులేటి కంపెనీలు దక్కించుకున్నాయని, పనులు ప్రారంభం కాకముందే ఆ కంపెనీలకు అడ్వాన్స్‌లు చెల్లించారని ఆమె ఆరోపించారు.

# భక్తులు దైవంతో ప్రత్యక్ష సంభంధాన్ని అనుభవించే దివ్య ద్వారమే పూరీ క్షేత్రం

## “జగన్నాథ రథయాత్ర సందర్భంగా”



ఒడిషా రాష్ట్రంలోని పూరిలో జరిగే జగన్నాథ రథయాత్ర ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఒక ముఖ్యమైన వేడుక. ఈ రథయాత్ర చరిత్ర ఆధారాలతో 12వ శతాబ్దంలో ప్రారంభమైందని తెలుస్తుంది. జగన్నాథుడు (శ్రీ కృష్ణ పరమాత్ముడు) అతని సోదరుడు బలభద్రడు, సోదరి సుభద్ర తమ ఆలయం నుండి మరొక ఆలయానికి ప్రయాణం చేయడమే ఈ యాత్ర ప్రాధాన్యత. ఈ దేవతలు నగర పర్యటనకు వెళ్ళి అటు నుండే తమ అత్త ఇంటిని సందర్శించడం రథయాత్ర ప్రాధాన్యతను సంతరించుకుంది. ఆషాడ మాసం రావడంతో ప్రపంచ వ్యాప్తంగా భక్తులు ఎదురు చూస్తున్న పూరీ జగన్నాథ రథయాత్ర ఈ నెల 27 శుక్రవారం నుండి ప్రారంభం కానుంది. ఆషాడమాసం వచ్చిన రెండవ రోజు జగన్నాథ రథయాత్ర జరుగుతుంది. రథయాత్ర సందర్భంగా ప్రపంచం నలుమూలల నుంచి భక్తులు పూరి ధామ్ చేరుకొన్న భక్తులు రథయాత్ర సమయంలో జగన్నాథుడితో పాటు బలరాముడి, సుభద్రల రథాన్ని లాగేందుకు పోటీ పడతారు. అయితే రథయాత్ర సమయంలో జనసంద్రంగా మారిన నేపథ్యంలో చాలా మంది భక్తులు కనీసం తాడునైనా తాకాలి అని భావిస్తారు. కానీ ఈ కోరిక తీరడం కూడా కష్టం అవుతుంది. రథయాత్ర సమయంలో రథాన్ని లాగడం, తాడును తాకడం చాలా శుభప్రదంగా పరిగణించ బడుతుంది.

### రథయాత్రలో పాల్గోనే రథాలు, వాటిని లాగే తాడు పేరు

జగన్నాథుడు, బలరాముడు, సుభద్రలు ఆశీనులు అయ్యే మూడు రథాలకు పేర్లు భిన్నంగా ఉన్నాయి. అదే విధంగా ఆ రథాలను లాగే తాళ్ల పేర్లు కూడా భిన్నంగా ఉన్నాయి. జగన్నాథుని 16 చక్రాల రథాన్ని నందిఘోష, బలభద్రుని 14 చక్రాల రథాన్ని తలధ్వజ, మధ్యలో ఉండే సుభద్ర 12 చక్రాల రథాన్ని దర్పదలన అంటారు. జగన్నాథుని రథాన్ని లాగే తాడును శంఖచూడుడు, బలరాముడి రథం తలధ్వజ తాడును వసూలి, మధ్యలో ఉన్న సుభద్ర 12 చక్రాల రథం తాడును స్వర్ణుచుడ అని పిలుస్తారు.

### జగన్నాథ రథం తాడును తాకడంతో జన్మసాపల్యం

పూర్తి విశ్వాసంతో పూరీకి చేరుకున్న ఏ వ్యక్తి అయినను కుల మతాలకతీతంగా జగన్నాథుని రథం తాడును లాగవచ్చును. రథం తాళ్లను లాగేవారు జీవిత మరణ చక్రం నుంచి విముక్తినోంది మోక్షాన్ని పొందుతారని భక్తుల విశ్వాసం.

### రథయాత్రలో రథం లాగడంతో జగన్నాథుని ఆశీస్సులు

రథయాత్రలో పాల్గొనే ప్రతి భక్తుడు రథం తాడును తాకడానికి ఆసక్తి చూపుతాడు. మత విశ్వాసాల ప్రకారం రథం తాడును తాకడం, లాగడం వల్ల జగన్నాథుని ఆశీస్సులు లభిస్తాయి. అంతే కాదు జగన్నాథ రథం తాడును తాకడం ద్వారా వ్యక్తి తెలిసి తెలియక చేసిన పాపాల నుంచి విముక్తి పొందుతాడని, ఆ వ్యక్తి భక్తి మార్గంలో ముందుకు సాగుతాడని చెబుతారు. ఎవరైనా జగన్నాథ రథయాత్రకి వెళ్లి రథం తాడును తాకకుండా ఇంటికి తిరిగి వస్తే యాత్ర విజయవంతం కాదని నమ్ముతారు. జగన్నాథ రథయాత్రలోని తాడును తాకడం చాలా ప్రయోజనకరమైనది, పుణ్యప్రదమైనదిగా పరిగణించబడుతుంది. రథం తాడును తాకడం వల్ల పాపాలు శుద్ధి అవుతాయని, జనన మరణ చక్రం నుంచి భక్తులు విముక్తి పొందుతారని చెబుతారు. అటువంటి ఈ రథయాత్రలో పాల్గొనడం, రథం తాడును తాకడం వల్ల జీవితంలో అదృష్టం వరిస్తుంది.

### రథయాత్ర సంబరం

మేళతాళాలతో గర్భగుడిలోకి వెళ్లిన పండాలు (పూజరులు) ఉదయకాల పూజాదికాలు నిర్వహిస్తారు. శుభ ముహూర్తం ఆసన్నమవగానే మనిమా(జగన్నాథా) అని పెద్దపెట్టున నినాధాలు చేస్తు రత్నపీఠం మీద ఉన్న విగ్రహాలను కదిలించి ఆలయ ప్రాంగణంలోని ఆనందబజారు, అరుణస్తంభం మీదుగా వాటిని ఉరేగిస్తు బయటికు తీసుకువస్తారు. ఈ క్రమంలో ముందుగా దాదాపు ఐదున్నర అడుగుల ఎత్తుండే బలరాముడి విగ్రహాన్ని తీసుకువస్తారు. బలభద్రుడ్ని చూడగానే జై బలరామా, జైజై బలదేవా అంటు భక్తులు చేసే జయజయ ధ్వానాలతో బోడోదండా మారుమోగిపోతుంది. బలరాముడి విగ్రహాన్ని ఆయన రథమైన తాళధ్వజంపై ప్రతిష్ఠింపజేసిన అనంతరం స్వామి విగ్రహాన్ని అలంకరించిన తలపాగా ఇతర అలంకరణలను తీసి భక్తులకు పంచిపెడతారు. అనంతరం ఇదే పద్ధతిలో సుభద్రాదేవి విగ్రహాన్ని కూడా బయటికి తీసుకువచ్చి పద్మధ్వజం అనే రథం మీద ప్రతిష్ఠిస్తారు. ఇక ఆ జగన్నాథుడిని దర్శించుకునే క్షణం కోసం భక్తులు తహతహలాడి పోతుంటారు. దాదాపు ఐదడుగుల ఏడంగుళాల ఎత్తుండే జగన్నాథుడి విగ్రహాన్ని ఆలయ ప్రాంగణంలో నుంచి బయటికి తీసుకు వస్తుండగానే జయహెూ జగన్నాథా అంటు భక్తిపారవశ్యంతో జయజయ ధ్వానాలు చేస్తారు. ఇలా మూడు విగ్రహాలను రథాలపై కూర్చుండబెట్టే వేడుకను పహాండీ అంటారు. ఈ దశలో కులమత భేదాలు లేకుండా అందరు జగన్నాథుడి విగ్రహాన్ని తాకవచ్చు. ఈ మూడు విగ్రహాలను తీసుకువచ్చే వారిని దైత్యులు అంటారు. వీరు ఇంద్రద్యుమ్న మహారాజు కన్నా ముందే ఆ జగన్నాథుడిని నీలమాధవుడి రూపంలో అర్చించిన సవరతెగ రాజు విశ్వావసు వారసులు. ఆలయ సంప్రదాయాల ప్రకారం ఉరేగింపు నిమిత్తం మూల విరాట్టులను అంతరాలయం నుంచి బయటికి తీసుకువచ్చి రథాల మీద ప్రతిష్ఠింప చేసే అర్హత వీరికి మాత్రమే ఉంటుంది. సుభద్ర, జగన్నాథ, బలభద్రులు రథారూఢులై యాత్రకు సిద్ధంగా ఉండగా పూరీ సంస్థానాధీశులు అక్కడికి చేరుకుంటాడు. జగన్నాథుడికి నమస్కరించి రథం మీదికి ఎక్కి స్వామి ముంగిట బంగారు చీపురుతో శుభ్రం చేస్తాడు. ఈ వేడుకను చెరా పహారా అంటారు. అనంతరం స్వామిపై గంధం నీళ్లు చిలకరించి రథం పై నుండి కిందికి దిగి రథం చుట్టు మూడుసార్లు ప్రదక్షిణం చేస్తాడు. ఇదే తరహాలో బలరాముడిని, సుభద్రాదేవిని అర్చించి వారి రథాల చుట్టు కూడా ప్రదక్షిణ చేస్తాడు. అనంతరం రథాలకు తాత్కాలికంగా అమర్చిన తాటిమెట్లను తొలగిస్తారు. ఇక యాత్ర మొదలవడమే తరువాయి. జగన్నాథుడి రథం మీదుండే ప్రధాన పండా నుంచి సూచన రాగానే కస్తూరి కళ్లాపి చల్లి హారతిచ్చి జై జగన్నాథా అని పెద్దపెట్టున నినాదాలతో తాళ్లను పట్టుకుని రథాన్ని లాగడం మొదలు పెడతారు. విశాలమైన బోడోదండ (ప్రధానమార్గం) గుండా యాత్ర మందగమనంతో సాగుతుంది. లక్షలాది భక్తజనం నడుమ జగన్నాథుడి రథం అంగుళం అంగుళం చొప్పున చాలా నెమ్మదిగా కదులుతుంది. దీన్నే ఘోషయాత్ర అంటారు. భక్తుల తొక్కిసలాటలో చక్రాలకింద ఎవరైనా పడినా, దారిలో ఏ దుకాణమైనా అడ్డువచ్చినను రథం వెనకడుగు వేసే ప్రసక్తే ఉండదు. అడ్డొచ్చిన దుకాణాలను కూలగొట్టైనా సరే ముందుకే నడిపిస్తారు. ఈ యాత్ర ఎంత నెమ్మదిగా సాగుతుందంటే జగన్నాథుడి గుడి నుంచి కేవలం మూడు మైళ్ల దూరంలో ఉండే గుండిచా గుడికి చేరుకోవడానికి దాదాపు పన్నెండుగంటల సమయం పడుతుంది. గుండిచా ఆలయానికి చేరుకున్నాక ఆ రాత్రి బయటే రథాల్లోనే మూలవిరాట్లకు విశ్రాంతినిస్తారు. మర్నాడు ఉదయం మేళతాళాలతో గుడిలోకి తీసుకువెళతారు. వారం రోజులపాటు గుండిచాదేవి ఆతిథ్యం స్వీకరించిన అనంతరం దశమినాడు తిరుగు ప్రయాణం మొదలవుతుంది. దీన్ని బహుదాయాత్ర అంటారు. ఆ రోజు మధ్యాహ్నానికి మూడు రథాలు జగన్నాథ ఆలయానికి చేరుకుని గుడి బయటే ఉండిపోతాయి. మర్నాడు ఏకాదశినాడు స్వామి వార్లను బంగారు ఆభరణాలతో అలంకరిస్తారు. సునావేషా వ్యవహరించే ఈ వేడుకను చూసేందుకు బారులు తీరుతారు భక్తులు. ద్వాదశినాడు విగ్రహాలను మళ్లీ గర్భగుడిలోని రత్న సింహాసనంపై అలంకరించడం తో యాత్ర పూర్తయినట్లుగా భావిస్తారు. యాత్ర పేరిట పదిరోజులుగా స్వామి లేని ఆలయం నూతన జవజీవాలు పుంజుకుని కొత్తకళ సంతరించుకుంటుంది.

### పూరి జగన్నాథ స్వామి ఆలయ ప్రాశస్త్యం

పూరీ జగన్నాథుని ఆధ్యాత్మిక ప్రాముఖ్యత చాలా గొప్పది. భక్తులు దైవంతో ప్రత్యక్ష సంబంధాన్ని అనుభవించడానికి ఇది ఒక దివ్య ద్వారంగా పరిగణిస్తుంది. ఉదయం ప్రార్థనల నుండి సాయంత్రం నైవేద్యాల వరకు భక్తులకు ఆలయ ఆచారాలు లోతైన ఆధ్యాత్మిక సంబంధం, శుద్ధిని పెంపొందించడానికి దోహదపడతాయి. శ్రీకృష్ణుని భక్తులకు, మహావిష్ణు భక్తులకు ఈ దేవాలయం ఎంతో ముఖ్యమైనది. ఈ ఆలయంలో ప్రధాన విగ్రహాలు కర్రతో తయారు చేసి ఉండటం ఇక్కడి ప్రత్యేకత. ఆలయంలో శ్రీకృష్ణుడు, సుభద్ర, బలరామ సమేతంగా దర్శనమిస్తాడు. జగన్నాథుని పేరుతో ఆలయ దైవం ఉంటుంది. హిందూ ఆచారాల ప్రకారం, భక్తులకు ముఖ్యంగా మహావిష్ణువు, శ్రీకృష్ణుడిని ఆరాధించు వాళ్లకు ఈ దేవాలయం ప్రముఖ పుణ్యక్షేత్రం. ప్రతి హిందువు తన జీవితకాలంలో తప్పక దర్శించవలసిన ఛార్ ధాం పుణ్యక్షేత్రాలలో ఈ దేవాలయం కూడా ఉండడం విశేషం. ఈ దేవాలయం ప్రతి సంవత్సరం నిర్వహించే రథయాత్ర లేదా రథోత్సవానికి ప్రసిద్ధి చెందింది. ఇందులో మూడు ప్రధాన విగ్రహాలను ఎంతో గొప్పగా, అందంగా అలంకరించిన రథాలపైన ఊరేగిస్తారు. మధ్య కాలం నుంచి ఈ ఉత్సవం అధిక మత తీవ్రతతో ముడిపడి ఉంది. వైష్ణవ సంప్రదాయాలకు, ఈ ఆలయంతో దగ్గర సంబంధమున్న రామానంద స్వామి వారికి ఈ గుడి ఎంతో పవిత్రమైనది. గౌడియ వైష్ణవ మతస్తులకు కూడా ఈ ఆలయం ప్రాముఖ్యమైంది.



రవి కుమార్ సంతోజు
బడంగ్ పేట్. రంగారెడ్డి

# ఉద్యోగులు, పెన్షనర్లకు తెలంగాణ సర్కార్ తీపికబురు

సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ఉద్యోగులకు సంబంధించిన వైద్య బిల్లుల బకాయిలను విడుదల చేశామని తెలిపారు. 2023 మార్చి 4 నుండి 2025 జూన్ 20 వరకు పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్లులను సమగ్రంగా పరిశీలించి ఈ మొత్తాన్ని విడుదల చేశామని భట్టి విక్రమార్క చెప్పుకొచ్చారు. బకాయిలు ఉన్న మొత్తం రూ. 180.30 కోట్లు మెడికల్ బిల్లులను విడుదల చేశామని ఈ నిర్ణయం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 26,519 మంది ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రయోజనం కలగనుందని భట్టి విక్రమార్క తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉన్న బకాయిలతో పాటుగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో పేరుకుపోయిన బకాయిలను కూడా విడుదల చేశామని వెల్లడించారు. పెండింగ్ బకాయిలను విడుదల విడుదల చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల ఉద్యోగ, పెన్షనర్ల సంఘాల నేతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రేవంత్ సర్కార్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నారు. గతంలో ప్రభుత్వం మారినప్పుడు ఈ విధంగా వెంటనే స్పందించిన సందర్భాలు చాలా తక్కువగా ఉన్నాయని ఉద్యోగ సంఘాల నేతలు అభిప్రాయపడ్డారు. ఇక తాజాగా తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. రెండు డీఏలో ఒకదాన్ని వెంటనే ప్రకటించగా రెండో దాన్ని ఆరు నెలల్లో విడుదల చేస్తామని ప్రకటించింది. అలానే విద్యుత్ ఉద్యోగుల డీఏను కూడా 2 శాతం విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈపెంచిన డీఏ ఈ ఏడాది నుంచే అనగా 2025, జనవరి నుండి వర్తిస్తుందని వెల్లడించారు. ప్రభుత్వ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 71,417 మంది విద్యుత్ శాఖ సిబ్బంది, పెన్షనర్లకు ప్రయోజనం కలగనుంది అని తెలిపారు. ఇక తాజాగా మెడికల్ బకాయిలు విడుదల చేసి వారికి మరింత ప్రయోజనం కలగజేసింది.

# 35లక్షల పర్యాటకులే టార్గెట్

పాల్గొన్నారు. కేంద్రం నిధులు రూ.375 కోట్లతో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో పలు ప్రాజెక్టులు చేపట్టబోతున్నారు. వీటికి సంబంధించి ఏర్పాటు చేసిన ఫోటో గ్యాలరీని కేంద్రమంత్రి షెకవాత్ తో కలిసి పవన్ కళ్యాణ్ తిలకించారు. అనంతరం గోదావరి తీరం రివర్ ఫ్రంట్ వ్యూ పాయింట్ నుంచి అఖండ గోదావరి ప్రాజెక్టు చేపట్టబోయే ప్రాంతాన్ని పరిశీలించారు. రాజమండ్రి అనగానే గుర్తొచ్చేది గోదావరి తీరమని, తీరం వెంబడి నాగరికత, నాగరికత ఉన్న చోట భాష వృద్ధి చెందుతాయని పవన్ కళ్యాణ్ తెలిపారు. అలాంటి ఈ నేల ఆంధ్రుల అన్నపూర్ణగా పేర్గాంచిన డొక్కా సీతమకు జన్మనిచ్చిందన్నారు. మహాభారతాన్ని తెలుగులో అందించిన ఆదికవి నన్నయకు జన్మనిచ్చిన నేల ఇది అన్నారు. ఎంతో మంది కళాకారులకు, సామాజిక వేత్తలకు జన్మనిచ్చింది ఈ నేల అన్నారు. బాపు-రమణల్లో ఒకరైన ముళ్లపూడి వెంకటరమణను అందించిన నేల కూడా అన్నారు. హేవలాక్ బ్రిడ్జి చాలా పురాతనమైందని,నిరుపయోగంగా ఉందని, దీన్ని బాగుచేసుకొని టూరిజం ప్రాజెక్టుగా వినియోగించుకోవాలన్నది చాలా దశాబ్దాలుగా గోదావరి ప్రజల ఆకాంక్ష, కల అన్నారు. ఈ కలను సాకారం చేసే దిశగా ముందుకు వెళ్తున్నట్లు పవన్ తెలిపారు. దాదాపు రూ.430 కోట్లతో 7 టూరిజం ప్రాజెక్టుల పనులు ప్రారంభిస్తున్నట్లు తలిపారు. వీటిల్లో కొన్నింటికి ప్రణాళికలు పూర్తికాగా మరికొన్ని పనులు పూర్తిచేశామన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని 2024 ఎన్నికల సమయంలో ఎన్డీయే సర్కార్ నిర్ణయించిందని, అందులో భాగమే అఖండ గోదావరి ప్రాజెక్టు అన్నారు. పర్యాటక రంగంలో యువతకు ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, ఈ ప్రాజెక్టు పూర్తయితే 800 మందికి ఉపాధి దొరుకుతుందని ఆయన తెలిపారు. టూరిజం ప్రాజెక్టులు పూర్తయితే దాదాపు 4 లక్షల మందికి ఉపాధి అవకాశాలు దొరుకుతాయన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్ అంటే పదం కాదని, శక్తివంతమైన ప్రభుత్వం అని అర్థమన్నారు. రాష్ట్రంలో, కేంద్రంలో శక్తివంతమైన ప్రభుత్వాలు ఉండటం వల్ల ప్రాజెక్టులు సులువుగా వస్తాయని, త్వరగా పూర్తి చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ మొదటి నుండి ఏపీకి సంపూర్ణ సహకారం అందిస్తున్నారని, విశాఖ స్టీల్ ప్లాంట్ కాపాడటంలో నాడు జలశక్తి మంత్రిగా ఉండి సహకరించారన్నారు. పోలవరం ప్రాజెక్టుకు సైతం సహకరించారన్నారు.ఏపీకి 974 కి.మీల సుదీర్ఘ సముద్రతీరం, గోదావరి, కృష్ణా, వంశధార, నాగావళి, ఇంకా ఎన్నో చిన్న నదులు ఉన్నాయని, నదీ పరివాహక ప్రాంతాల్లో రివర్ ఫ్రంట్ ఏరియా ఉంటుందని, విదేశాల్లో ఈ ప్రాంతాన్ని టూరిజం స్పాట్ లుగా అభివృద్ధి చేసుకుంటారని, మనకు నదులు సంస్కృతిలో భాగమని, ఈ క్రమంలో పుష్కర్ ఘాట్ అభివృద్ధితో పాటు చారిత్రక, కళా, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా అభివృద్ధి చేస్తామన్నారు. అన్నవరం, గండికోట, శ్రీశైలం తదితర ప్రాంతాలు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ నేతృత్వంలో అభివృద్ధి చెందుతున్నాయని, ఇటీవల విదేశాల పర్యటనకు దుర్గేష్ వెళ్లి వచ్చారని, పవిత్ర బుద్ధ భగవానుని అవశేషాలను వియత్నాం దేశానికి తీసుకెళ్లారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి సహకారంతో 2035 నాటికి 35 లక్షల మంది పర్యాటకులను అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టు ద్వారా ఆకర్షించేలా, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పర్యాటక కేంద్రాలకు పునరుజ్జీవం పోసేలా ప్రధాని నరేంద్ర మోదీ సహకారం, సీఎం చంద్రబాబునాయుడు నాయకత్వం, పర్యాటక రంగాన్ని అద్భుతంగా తీర్చిదిద్దాలి అన్న ఆలోచనతో ఉన్న నేలబిడ్డ కందుల దుర్గేష్ ల సారథ్యంలో పర్యాటక రంగం ముందుకు వెళ్తుందన్నారు.

# ఘనంగా పసుపు బోర్డు ప్రారంభోత్సవం

నిజామాబాద్ (ప్రశ్న న్యూస్) కేంద హెూంమంత్రి అమిత్ షా చేతుల మీదుగా 29న పసుపు బోర్డు కార్యాలయం ప్రారంభం ఘనంగా నిర్వహించనున్నట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. నిజామాబాద్ లో పర్యటించిన కేంద్ర మంత్రి మీడియా సమావేశంలో మాట్లాడుతూ అనేక సంవత్సరాల పసుపు రైతుల ఆకాంక్ష బోర్డుతో నెరవేరిందని హర్షం వ్యక్తం చేశారు. అనేకరాజకీయ పార్టీలు హామీ ఇచ్చినా అర్వింద్ కృషి వల్ల ప్రధాని మోడీ ఆశీస్సులు ఆదేశాలతో పసుపు బోర్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేశవ్యాప్త కార్యక్రమాలకు కేంద్రంగా నిజామాబాదు లోనే బోర్డు ఏర్పాటు చేయడం గొప్ప విషయమని కొనియాడారు.ఇతర రాష్ట్రాలు కోరినా కూడా ప్రధాని మోడీ నిజామాబాదులోనే ఏర్పాటు చేయడం ఇక్కడి రైతులకు అందించిన బహుమతి అని పేర్కొన్నారు. జిల్లాకు చెందిన రైతు బిడ్డ అయిన గంగారెడ్డిని చైర్మన్ చేయడం మరో విశేషం అని చెప్పారు. 29న రైతులు స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున రావాలని విజ్ఞప్తి చేశారు. దేశంలో పసుపు ఉత్పత్తి పెరిగే విధంగా ఉపాధి పెరిగే విధంగా రైతులకు ప్రయోజనం కలిగే విధంగా బోర్డు కార్యాచరణతో ముందుకు సాగుతుందన్నారు. మాజీ మంత్రి డీఎస్ విగ్రహాన్ని కూడా అమిత్ షా నిజామాబాదులో 29న ఆవిష్కరిస్తారని స్పష్టం చేశారు.సీఎం రేవంత్ పీసీసీ చీఫ్‌గా ఉన్నప్పుడు పదే పదే ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ జరపాలని డిమాండ్ చేశారని గుర్తుకు చేశారు. తెలంగాణ పోలీసులపైనే స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తే న్యాయం జరగదని కాంగ్రెస్ లో ఉన్న వారు కూడా అంటున్నందున బీఅర్ఎస్‌తో కుమ్మక్కు కాలేదని నిరూపించుకోవాలంటే రేవంత్‌కు చిత్తశుద్ధి ఉంటే సీబీఐకి ఫోన్ ట్యాపింగ్ కేసును అప్పగించాలని డిమాండ్ చేశారు. హై కోర్టు న్యాయవాదుల ఫోన్లు కూడా ట్యాపయ్యాయనిఆరోపించారు. మొదటి నుంచి ట్యాపింగ్ కేసును సీబీఐ కి కాంగ్రెస్ ఇస్తుందా? ఇవ్వదా? అనే అనుమానంతో బీజేపీ హైకోర్టుకు వెళ్ళిందన్నారు. ట్యాపింగ్ కేసు సాధారణమైనది కాదని, తెలంగాణ ప్రజల ఆకాంక్షల మేరకు సీబీఐకి కేసును అప్పగించాలని డిమాండ్ చేశారు.

# కూటమి ప్రభుత్వానికి ఆర్థిక క్రమశిక్షణ లోపించింది

సమీకరించిందని జగన్ తెలిపారు. దీంతో మొత్తం బాండ్ల విలువ రూ. 9,000 కోట్లకు చేరిందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ఏపీ హైకోర్టులో కేసు విచారణలో ఉందని, నోటీసులు కూడా జారీ అయ్యాయని గుర్తుచేశారు. ఈ బాండ్ల ద్వారా సమీకరించిన నిధులను ప్రభుత్వ రెవెన్యూ వ్యయాల కోసం వినియోగిస్తున్నారని స్పష్టమవుతోందని ఆయన ఆరోపించారు.రాజ్యాంగ నిబంధనలను పూర్తిగా విస్మరించి, అపూర్వమైన రీతిలో టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రైవేటు పార్టీలకు రాష్ట్ర సంఘటిత నిధిని వినియోగించుకునేందుకు అవకాశం కల్పించిందని జగన్ దుయ్యబట్టారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ద్వారా డైరెక్ట్ డెబిట్ ఆదేశాలు జారీ చేసి, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల ప్రమేయం లేకుండానే ప్రైవేటు వ్యక్తులు రాష్ట్ర ఖజానా నుంచి నిధులు విత్‌డ్రా చేసుకునే వెసులుబాటు కల్పించారని తెలిపారు.

ఇది భారత రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 203, 204, 293(1) లను పూర్తిగా ఉల్లంఘించడమేనని ఆయన అన్నారు. ఎన్‌సీడీ బాండ్లకు అదనపు హామీగా, గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం రూ. 1,91,000 కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తి అయిన ఖనిజ సంపదను కేవలం రూ. 9,000 కోట్ల బాండ్ల కోసం తాకట్టు పెట్టిందని జగన్ విమర్శించారు. రాష్ట్ర సంఘటిత నిధికి ఇలా ప్రైవేటు వ్యక్తులకు అనుమతి ఇవ్వడం, ఇంత భారీ మొత్తంలో ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టడం చూస్తుంటే, ఈ బాండ్లు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే రాష్ట్ర అభివృద్ధి రుణాల (ఎస్‌డీఎల్) కంటే ఎక్కువ సురక్షితమైనవిగా భావించాలా? అని వ్యాఖ్యానించారు. అయినప్పటికీ, ఏపీఎండీసీ బాండ్లను 9.30 శాతం అధిక వడ్డీ రేటుకు జారీ చేశారని, ఇది ప్రస్తుతం రాష్ట్ర అభివృద్ధి రుణాలపై ఉన్న వడ్డీ రేటు కంటే 2.60 శాతం ఎక్కువని జగన్ తెలిపారు. ఈ అధిక వడ్డీ రేటు కారణంగా ఏపీఎండీసీపై ఏటా అదనంగా రూ. 235 కోట్ల భారం పడుతుందని, ఈ బాండ్ల కాలపరిమితి పదేళ్లుగా ఉందని తెలిసిందని అన్నారు. ఈ అదనపు భారం వల్ల లబ్ధి పొందింది ఎవరో ముఖ్యమంత్రి చంద్రబాబు సమాధానం చెప్పాలని జగన్ డిమాండ్ చేశారు. ఈ ఎన్‌సీడీల జారీతో, టీడీపీ కూటమి ప్రభుత్వం ఈ 13 నెలల కాలంలో సమీకరించిన బడ్జెట్, ఆఫ్-బడ్జెట్ రుణాలు, గత ప్రభుత్వం ఐదేళ్లలో తీసుకున్న రుణాల్లో 50 శాతానికి పైగా ఉన్నాయని జగన్ ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై, ప్రభుత్వ రుణాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, పారదర్శకత పాటించాలని ఆయన డిమాండ్ చేశారు.

# ప్రశాంతమైన గాఢనిద్రను పొందాలంటే..

ప్రశాంతమైన గాఢ నిద్ర, ఆరోగ్యవంతమైన శరీరాన్ని పొందడానికి ఉదయం వ్యాయామం చేయాలి. నిద్రపోయే ప్రదేశం ప్రశాంతంగా, ఎలాంటి శబ్దాలు లేకుండా చీకటిగా ఉండేలా చూసుకోవాలి. ప్రతిరోజూ ఉదయం కొంత సమయం కేటాయించి క్రమం తప్పకుండా ధ్యానం చేస్తే నిద్రలేమి సమస్య నుంచి బయటపడే అవకాశాలు ఉంటాయి. ప్రతి ఒక్కరికి నిద్ర చాలా ముఖ్యమైనది. రాత్రిపూట తగినంత నిద్ర ఉంటేనే ఆ మర్నాడు మంచి శక్తితో మేల్కొని రోజంతా చురుగ్గా ఉంటారు. కానీ,నేటి ఆధునిక జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా చాలా మంది నిద్రలేమి సమస్యతో ఇబ్బందిపడుతున్నారు. నిద్రకోసం వారు ఏవేవో ప్రయత్నాలు చేస్తుంటారు. వైద్యుల సలహా మేరకు కొందరు మందులు కూడా వాడుతుంటారు. కానీ, ఇవేవీ లేకుండా ప్రశాంతమైన నిద్రను పొందాలనుకుంటే.. కొన్ని సింపుల్ టిప్స్ పాటించవచ్చు అంటున్నారు నిపుణులు. ప్రశాంతమైన నిద్రకోసం ముఖ్యంగా రాత్రి సమయంలో అతిగా భోజనం చేయకూడదు అంటున్నారు నిపుణులు. బదులుగా సులువుగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవాలని చెబుతున్నారు.. నిద్రకు రెండు గంటల ముందే రాత్రి భోజనాన్ని ముగించాలని సూచిస్తున్నారు. టీవీ, ఫోన్, ల్యాప్ టాప్ వంటి వాటితో రాత్రి వేళ ఎక్కువ సమయం గడపకూడదు..ఇలా చేయటం వలన ఫోన్ నుంచి విడుదలయ్యే నీలి రంగు కాంతి నిద్రకు ఆటంకం కలిగిస్తుంది. నిద్రకు సిద్ధమయ్యే ముందు గ్లాసు గోరువెచ్చని పాలు తాగడం కూడా మంచిది. పాలలో ఉండే ట్రిప్టోఫాన్ అనే అమినో యాసిడ్ శరీరంలో నిద్రకు అవసరమైన మెలటోనిన్ హార్మోన్ ఉత్పత్తిని పెంచుతుంది. దీని వల్ల చక్కగా నిద్రపడుతుంది. రాత్రి సమయంలో టీ, కాఫీ, కూల్ డ్రింక్స్, కేక్స్ తీసుకోకూడదు. వీటిలో ఉండే షుగర్, కెఫిన్లు నిద్రకు ఆటంకం కలిగిస్తాయి. రోజువారీ వ్యాయామం ద్వారా నిద్రలేమి లక్షణాలను నియంత్రించవచ్చు. రోజూ తగినంత వ్యాయామం చాలా ముఖ్యం. ప్రశాంతమైన గాఢ నిద్ర, ఆరోగ్యవంతమైన శరీరాన్ని పొందడానికి ఉదయం వ్యాయామం చేయాలి. నిద్రపోయే ప్రదేశం ప్రశాంతంగా, ఎలాంటి శబ్దాలు లేకుండా చీకటిగా ఉండేలా చూసుకోవాలి. ప్రతిరోజూ ఉదయం కొంత సమయం కేటాయించి క్రమం తప్పకుండా ధ్యానం చేస్తే నిద్రలేమి సమస్య నుంచి బయటపడే అవకాశాలు ఉంటాయి.



## డ్రోన్ ఆపరేటర్ల సమస్యల పరిష్కారం..!
## ప్రభుత్వ గుర్తింపు దిశగా యూనియన్ ఏర్పాటు..!!

- డ్రోన్ యూనియన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు : వికృతి ఆంజనేయులు
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో డ్రోన్ యూనియన్ ఏర్పాటు
- అధ్యక్షులుగా వికృతి ఆంజనేయులు ఏకగ్రీవం



బోయినిపల్లి,(ప్రశ్న న్యూస్)బోయినిపల్లి మండల కేంద్రంలో గురువారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయిలో డ్రోన్ యూనియన్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నూతన యూనియన్ కు కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వికృతి ఆంజనేయులు అధ్యక్షులుగా, దాన వేణు, రాసూరి అశోక్, ఎం. నవీన్, మహేష్ రెడ్డి, కర్ణాకర్ రెడ్డి ఉపాధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించారు. చిందం శశి ప్రధాన కార్యదర్శిగా, ఎర్రం రామిరెడ్డి కార్యదర్శిగా, భూపేందర్ రెడ్డి కోశాధికారిగా నియమితులయ్యారు. డైరెక్టర్లుగా శ్రీనివాస్ రెడ్డి, రవీందర్, అజయ్, మోహన్, బండి నరేష్, భీమ నరేష్, మహేందర్, చిగుళ్ల శ్రీనివాస్, గంట శ్రీనివాస్, మహేందర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా నూతన అధ్యక్షులు వికృతి ఆంజనేయులు మాట్లాడుతూ ముందుగా నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలను, తన ఏకగ్రీవంగా ఎన్నికకు కృషి చేసిన సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసి, "డ్రోన్ రంగం సమకాలీన వ్యవస్థలో ఎంతో కీలకమైంది. రైతులకు సహాయం, సర్వేలు, మెపింగ్, సెక్యూరిటీ వంటి అనేక రంగాల్లో డ్రోన్ల పాత్ర అమూల్యమైంది. కానీ ఈ రంగంలో పనిచేస్తున్న మనుగడ కోసం ఎన్నో సమస్యలు ఎదురవుతున్నాయి. సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ గుర్తింపుకు, డ్రోన్ ఆపరేటర్ల హక్కుల కోసం ఈ యూనియన్ బలంగా ముందడుగు వేస్తుంది" అని తెలిపారు.

## లద్నాపూర్ యువ కరాటే ప్లేయర్ పొట్ల శ్రీవన్ కుమార్

### బ్లాక్ బెల్ట్ జాతీయ స్థాయి ప్రతిభ




మంథని (ప్రశ్న న్యూస్) పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం లోని లద్నాపూర్ గ్రామానికి చెందిన పొట్ల శ్రీవన్ కుమార్ ఈ నెల హైదరాబాద్ లో కరాటేలో బ్లాక్ బెల్ట్ సాధించి గ్రామానికి గర్వకారణంగా నిలిచారు. తను ఇప్పటికే జాతీయ స్థాయి కరాటే క్రీడాకారుడుగా తన ప్రతిభను నిరూపించుకున్నారు. ఈ విజయానికి అతని గురువు నాగరాజు మాస్టర్ నుండి సంవత్సరాల పాటు తీసుకున్న కఠినమైన శిక్షణ ప్రేరణగా నిలిచినది. శ్రీవన్ కుమార్ ఇప్పటికే ఎస్ జి ఎఫ్ ఐ స్టేట్ గోల్డ్ మెడలిస్ట్ తెలంగాణను రాష్ట్ర స్థాయిలో ప్రాతినిధ్యం వహించారు. అలాగే జాతీయ స్థాయి టోర్నమెంట్లలో కూడా తన కుదురైన పోరాటంతో మెరిశారు. ఈ సందర్భంగా శ్రీవన్ మాట్లాడుతూ బ్లాక్ బెల్ట్ సాధించటం తన జీవితంలో ఒక గొప్ప మైలురాయి అని తన లక్ష్యం అంతర్జాతీయ స్థాయిలో భారత్‌కు పేరు తీసుకురావటం. తమ గ్రామం లాంటి ప్రాంతాల నుంచి కూడా చాంపియన్స్ రావచ్చు అని తన విజయంతో నిరూపించాలనుకుంటున్నాను అని అన్నారు. శ్రీవన్ విజయంతో లద్నాపూర్ గ్రామం నిండా ఆనందోత్సాహ వాతావరణం నెలకొన్నది. క్రీడల పై ఆసక్తి కలిగిన యువతకు ఇది గొప్ప ప్రేరణగా నిలుస్తున్నది.

## పకడ్బందీ ఏర్పాట్లు అవసరం ఈవో బాపిరెడ్డి



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) ముక్కంటి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీ ద్రౌపతి సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో జూన్ 27 నుంచి ప్రారంభమయ్యే వార్షికోత్సవాలను పురస్కరించుకుని పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని నిర్ణయించినట్లు ఈవో టీ బాపిరెడ్డి సంయుక్తంగా తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ధర్మరాజుల స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఉత్సవాల్లో భాగంగా అర్జున తపస్సు, అగ్నిగుండ మహోత్సవాలకు భారీ ఎత్తున జనం వచ్చే అవకాశం ఉన్నందున అందుకు తగ్గట్టుగా పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాల్సి ఉందన్నారు. అగ్నిగుండం రోజున భారీగా భక్తులు ప్రవేశం చేసి మొక్కులు చెల్లించుకునే అవకాశముందన్నారు. భక్తుల భద్రత దృష్ట్యా చేపట్టాల్సిన ఏర్పాట్లను పరిశీలించారు.

## బీసీ హాస్టల్ ను సందర్శించిన రామచంద్ర యాదవ్



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి లో ఉన్న బీసీ సంక్షేమ హాస్టల్ లో జరిగిన సంఘటన గురించి అందరికి తెలిసిందేనని మంగళవారం ఉదయం విద్యార్థుల కు ఇచ్చిన అల్పాహారం లో ఫుడ్ పాయిజన్ జరగడం వల్ల సుమారు 16 మంది విద్యార్థులు అస్వస్థత కు గురై ఆసుపత్రి పాలై చికిత్స తీసుకుంటున్నారని తెలిపారు. బీసీవై రామచంద్ర యాదవ్ బీసీ హాస్టల్ సందర్శించారు. అనంతరం ఈ సందర్భంగా ఆయన మీడియా తో మాట్లాడుతూ ఇక్కడ ఉన్న విద్యార్థుల తో మాట్లాడి వాళ్ళ సమస్యల ను అడిగి తీసుకునేందు కు రావడం జరిగిందన్నారు. ఇక్కడ పరిస్థితు లు గమనించిన తరువాత నాకు అర్థమైన విషయం ఏమిటంటే ఇక్కడ ఉన్న అధికారి ఎవరైతే ఉన్నారో హాస్టల్ వార్డన్ పూర్తి నిర్లక్ష్యం వల్లే నిన్న జరిగిన సంఘటన మిగిలిన అన్నీ సమస్య కారణం అతడేనని విద్యార్థుల కు సరైన ఆహారం అందించినప్పుడు ఇక్కడ ఇబ్బందుల గురించి తెలియజేస్తే వాళ్ళని కొట్టె ప్రయత్నం చెయ్యడం, అనేక రకాల ఇబ్బందులకు హాస్టల్ వార్డన్ గురి చేస్తున్నాడని చెప్పి చాలా మంది పిల్లలు వాపొయ్యరని తెలిపారు ఈ రోజుల్లో హాస్టల్ అంటే తల్లిదండ్రులు తమ పిల్లలను ఒక బిడ్డ లాగ చూసుకుంటరాని నమ్మకం తో ప్రభుత్వ హాస్టల్ చేర్పిస్తే వీళ్ళు నీచంగా దారుణం గా ప్రవర్తిస్తూరని ఆయన అగ్రహం వ్యక్తం చేశారు.

# ఆర్టీఏ ఆఫీసులో ఆకస్మికంగా ఏసిబి దాడులు

కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) మహానగరంలో ఉన్న వివిధ శాఖల్లో ఫిర్యాదులు ఏసిబి కార్యాలయానికి వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో గత కొన్ని రోజులుగా సికింద్రాబాద్ తిరుమల గిరి ఆర్టివో కార్యాలయం పై ఫోకస్ చేసిన అవినీతి నిరోధక శాఖ అధికారులు. ప్రతి చిన్న విషయంలో అమ్యాములు తడపకపోతే కార్యాలయం చూట్టూ ప్రదక్షనలు తప్పవు! నగర పౌరులు ఇచ్చిన సమాచారం మేరకు అవినీతి నిరోధక శాఖ అధికారులు రంగంలోకి దిగి పలు అనుమానాస్పద ఏజేంట్లను అదుపులోకి తీసుకున్నారు. సుమారు 23 మందికి పైగా అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ఏదేమైనా పేరు మోసిన మహానగరాల్లో నిత్యం ఏదో ఒక చోట ఏసిబి దాడుల్లో అవినీతి త్రిమింగలాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ నేపథ్యంలో సికింద్రాబాద్ తిరుమలగిరి ఆర్టిఏ కార్యాలయంలో ఏసిబి అధికారులు ఆకస్మిక సోదాలు నిర్వహించారు. నిన్న గురువారం ఉదయం నుండి ఏసీబీ అధికారులు పలు బృందాలుగా విడిపోయి తిరుమలగిరి ఆర్టిఏ కార్యాలయానికి చేరుకుని ఏజెంట్లు చేస్తున్న దందాను పసిగట్టి వారిని అదుపులోకి



తీసుకున్నారు. ఏజెంట్ల పై పక్కా నిఘా ఉంచిన ఏసీబీ బృందాలు 23 మంది ఏజెంట్లను అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు. ఏజెంట్ల నుండి నగదు, పలు వాహన ధృవీకరణ పత్రాలు, సెల్ ఫోన్లు, ఇతర డాక్యుమెంట్లు దొరికాయని ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. ఏజెంట్ల ఫోన్లను స్వాధీనం చేసుకొని అందులో ఉన్న సమాచారాన్ని తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు. ఆర్టీవో సిబ్బందిపై కూడా పలు




ఆరోపణలు ఉన్న నేపథ్యంలో వారిని కూడా విచారిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఆర్టీవో ను కూడా అన్ని కోణాలలో విచారించి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. ఒక్కో ఏజెంట్ దగ్గర 50 వాహన ధృవీకరణ పత్రాలు ఉన్నట్లు నిర్ధారణకు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. రాత్రి వరకు ఏసీబీ సోదాలు కొనసాగుతాయని హైదరాబాద్ రేంజ్ ఏసిబి డిఎస్పీ శ్రీధర్ స్పష్టం చేశారు.

# మత్తు పదార్థాలు వాడకం చేయడం ప్రమాదకరం

- మత్తు పదార్థాలకు ఎవరు బానిస కావొద్దు
- డ్రగ్స్ మహమ్మారిని తరిమికోడదాం
- డ్రగ్స్ రహిత తెలంగాణను నిర్మిద్దాం
- మత్తు పదార్థాల వాడకంపై అవగాహన సదస్సులు నిర్వహించాలి
- రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి,
- గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క

ములుగు (ప్రశ్న న్యూస్) యువతి యువకులు మత్తు పదార్థాలను వాడకుండా అన్నిచోట్ల అవగాహన సదస్సులు నిర్వహించాలని, మత్తు పదార్థాలను వాడకం చేయడం ఒక భూతం లాంటిదని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని తంగేడు మైదానం లో అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమం నకు రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళాశిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ నేటి సమాజాన్ని డ్రగ్స్ భూతంలా పట్టి పీడిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి సమాజంలో కొందరు అక్రమార్కులు వ్యాపారాత్మక ధోరణిలో పసి పిల్లలకు చాకోలెట్స్ రూపంలో డ్రగ్స్ ను అలవాటు చేయించి ఆ మత్తులోకి లాగేస్తుండటం ఆందోళన కలిగిస్తుందని అన్నారు. దీన్ని సవాల్ గా తీసుకున్న తెలంగాణ ప్రభుత్వం మన రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా మార్చడం కోసం ఈ కార్యక్రమాలను నిర్వహి%శీ%చడం జరుగుతుందని అన్నారు. యువత డ్రగ్స్ కి అలవాటు కావడం వలన వారి నిండు భవిష్యత్తు చీకటిలోకి నెట్టివేయబడుతుందని అన్నారు. రాష్ట్రం లో కానీ, దేశంలో కానీ చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధుల పై కూడా అత్యంత క్రూరంగా జరుగుతున్న లైంగిక దాడుల్లో డ్రగ్స్ తీసుకున్నవారే అధికంగా ఉంటున్నారని అన్నారు. ఈ పరిస్థితి నుండి బయట పడాలంటే చాలా కష్టమైన విషయం కాబట్టి, మన రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా మార్చడం కోసం తెలంగాణ ప్రభుత్వం అంకిత భావంతో కృషి చేస్తుందని, దీనిని విజయవంతం చేయడానికి ప్రజలు, ముఖ్యంగా యువత




ముందుకు రావాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ వాడకం చేయడం వల్ల కుటుంబాలు నాశనం కావడమే కాకుండా ఎంతో విలువైన ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువతి యువకులు తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మత్తు పదార్థాలు వాడకం చేయడంలో దూరంగా ఉండాలని, మత్తు పదార్థాల వాడకం వలన జరిగే అనారోగ్య సమస్యలపై యువత అవగాహన సదస్సు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమములో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, అదనపు ఎస్ పి సదానందం, గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవి చందర్, సంబంధిత అధికారులు, యువత, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ద్రౌపతి సమేత ధర్మరాజుల బ్రహ్మోత్సవాలు



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ద్రౌపతి సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో విద్యుత్ దీపాలు డెకరేషన్లు రేపు నుంచి ప్రారంభోయే ధర్మరాజుల గుడి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ఉండాలని దేవస్థానం పనులు వేగంగా చేస్తున్నారు ప్రధాన ఉత్సవాలుజూన్ 27 శుక్రవారం నుంచి అంకురార్పణ, ధ్వజారోహణం తో ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడి ఉత్సవాలు పూర్తిగా బయటి భక్తులతో ముడిపడి ఉంది. చివరి నాలుగు రోజులు ఉత్సవాలకు వేలాదిమంది చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలివస్తారు. ఈ ఉత్సవాలను ఇక్కడ ధర్మరాజుల స్వామి తిరునాళ్ళగా అభివర్ణిస్తారు.

## యువత మత్తు సమాజానికి విపత్తు




శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) మత్తు మార్గమే మరణ మార్గమని, డ్రగ్స్ మహమ్మారి యువత జీవితాల్ని సర్వనాశనం చేస్తుందని మారకద్రవ్యాలు లేని సమాజమే మన అందరి లక్ష్యమని శ్రీకాళహస్తి డిఎస్పీ నరసింహమూర్తి అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిర్మూల దినోత్సవం సందర్భంగా శ్రీకాళహస్తి పట్టణ విద్యార్థులు, ఆధ్వర్యంలో నాలుగు మాడ వీధుల్లో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఈనాటి యువతరాన్ని దారి మళ్లించి చెడు మార్గాల్లో నడిపిస్తున్న దురలవాట్లలో డ్రగ్స్ మహమ్మారి చాలా ప్రమాదకరమని, కొకైన్, చరస్, హెరాయిన్, మారిజువానా లాంటి మత్తు పదార్థాలకు యువత బానిసలుగా మారి చదువులు మానుకొని నిర్భాగ్యులవుతూ తమ కుటుంబ సభ్యుల్ని నిరాశ పరుస్తూ, అనారోగ్య పాలవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా యువత మేలుకొని చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ మంచి మార్గాన్ని ఎంచుకొని సమాజ సేవకులుగా మారాలని ఆయన పిలుపునిచ్చారు.

# 3 పదుల వయస్సు, 9 పదుల చోరీలు

- ఎన్ బి డబ్ల్యు కింద చంచల్ గూడా జైలుకు తరలింపు
- మూడు కమీషనర్ రేట్ పరిధిలో చోరీలు
- పందుల సంఖ్యలో చోరీలకు కేరాఫ్ గా అలీ




కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)మన చుట్టూ ఎంతో మంది రాకపోకలు సాగిస్తారు. వారిలోఎవరు మంచి ఎవరు చెడ్డవారో తెలుసుకొని అయోమయంలో ఉంటారు నగర ప్రజానికం. కానీమంచి తనంతో ఉంటూ ప్రాణాలు తీసే మాయగాళ్లు కూడా మన మధ్యలో ఉన్నారు. ఈ నేపథ్యంలో నిన్న తిరుమల గిరి డివిజన్ పోలీసులు ఓ అంతరాష్ట్ర ముఠాలకు చెందిన దొంగను అదుపులోకి తీసుకున్నారు కార?నా పోలీసులు అనంతరం చంచల్ గూడా జైలు కు తరలించారు. అతను ఒక అంతర్రాష్ట్ర దొంగ. 32 ఏళ్ల చిన్న వయసులోనే 94 చైన్ స్నాచింగ్లు చేసిన ఘనత అతనిది. మహానగరంలో మహిళల మెడలో బంగారు ఆభరణాలు కనిపిస్తే అదును చూసి కాజేయడంలో ఆయన దిట్ట. నగరవ్యాప్తంగా పలు ఠాణాలలో చైన్ స్నాచర్ల లిస్టులో మొదటి వరుసలో ఉన్న ఇతని పేరు పోలీసులకు మోస్ట్ వాంటెడ్ గా మారింది. చోరీలకు పెట్టింది పేరుగా మహానగరంలో అపర చాణిక్యుడైన మంత్రి శంకర్ కు తానేమీ తక్కువ కాదని నిరూపించుకున్నాడు. హైదరాబాద్, సైబరాబాద్ రాచకొండ కమిషనరేట్ల పరిధిలో పేరు మోసిన పాత నేరస్థుడైన అంతర్రాష్ట్ర గొలుసు దొంగను కారా?నా పోలీసులు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసి కటకటాల్లోకి నెట్టారు. 32 ఏళ్ల వయసున్న "అలీ"మూడు కమిషనరేట్ల పరిధిలలో 94 గొలుసు దొంగతనాలు చేసి పోలీసులకు కొరకరాని కొయ్యగా మారడంతో బాబర్ అక్రమ్ అలీకి పోలీసులు నాన్ బెయిలబుల్ వారంట్ జారీ చేశారు. కర్ణాటక బీదర్ ప్రాంతానికి చెందిన బాబా అక్రమ్ అలీ వృత్తిరీత్యా ఆప్టికల్ విక్రేతగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. 2015 లో కారా?నా పోలీస్ స్టేషన్ పరిధిలో పులుసు దొంగతనం కేసులో నిందితుడుగా ఉన్న ఆలీని పోలీసులు అరెస్టు చేశారు. అంతకుముందే నగరంలోని వివిధ ప్రాంతాలలో గొలుసు దొంగతనాలు చేయడంతో అతనిపై పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. అరెస్టు చేసిన అనంతరం విచారణ సమయంలో అజ్ఞాతంలోకి పరారైన అలీకి సికింద్రాబాద్ 11వ అదనపు మెట్రోపాలిటన్ జడ్జి నాన్ బెయిలబుల్ వారింటి జారీ చేశారు. అయితే మహారాష్ట్రలోని కళ్యాణ్‌లోని అధర్వాడి జైలులోని జిల్లా జైలులో అలీ ఉన్నట్లు అతనికి నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసినట్లు పోలీసులు తెలిపారు.

# టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబును సన్మానించిన సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్



మంథని ( ప్రశ్న న్యూస్) మంథని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసు ఆవరణలో గురువారం మధ్యాహ్నం జరిగిన మంథని, ముత్తారం మండలాల సంస్థాగత ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు, తెలంగాణ వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేన్, టీపీసీసీ పరిశీలకులు సంగీతం శ్రీనివాస్ లను సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ తెలిపారు.

# జూలై 9 సమ్మె విజయవంతం చేయండి

**-కార్మిక సంఘాల పిలుపు**

**- సార్వత్రిక సమ్మెకు సమాయత్తమవుతున్న కార్మిక సంఘాలు**



వేములవాడ,(ప్రశ్న న్యూస్) దేశవ్యాప్తంగా జూలై 9న జరగనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఏఐటీయూసీ భవనంలో గురువారం జరిగిన సన్నాహక సమావేశం ఉత్సాహంగా జరిగింది. సమావేశానికి ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను క్రమంగా హరిస్తోందని విమర్శించారు. 44 కార్మిక చట్టాలను నాలుగు శ్రామిక కోడ్‌లుగా మార్చడం వల్ల కార్మికుల అసలు హక్కులు – కనీస వేతనం, 8 గంటల పని సమయం, సమ్మె హక్కు, సంఘం ఏర్పాటుకు స్వేచ్ఛ –అన్నీ బలహీనమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. విదేశీ పెట్టుబడులకు, స్వదేశీ కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని, ఈ విధానాలను వ్యతిరేకిస్తూ, కార్మిక వర్గాల శక్తిని ప్రదర్శించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సమ్మెలో అంగన్వాడీ కార్యకర్తలు, రెండో ఏ.ఎన్.ఎం. లు, ఆశా వర్కర్లు,ఎన్. హెచ్.ఎం. కాంట్రాక్ట్ ఉద్యోగులు,ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, పవర్ లూం కార్మికులు,హమాలీలు, మిడ్డే మీల్స్ వంటమనుషులు, స్కావెంజర్స్, అటెండెంట్స్, భవన నిర్మాణ కార్మికులు, బీడీ కార్మికులు వంటి అన్ని రంగాల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపు ఇచ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, మీసం లక్ష్మణ్ (మిడ్డే మీల్స్), కోడం రమణ (సీఐటీయూ), అన్నల్దాస్ గణేష్, పోరండ్ల రమేష్ (బీ.ఆర్.టి.యు), సోమిశెట్టి దశరథం (ఏ ఐ ఎఫ్ టియు–న్యూ), జిందం ప్రసాద్ (టియుసిఐ), ఆకుల రాములు (ఐఎఫ్ టియు) తదితరులు పాల్గొన్నారు.

# గోశాల నూతన సిబ్బందికి నియామక పత్రాల అందజేత

**- నేటి నుండే విధుల్లోకి రావాలని ఆదేశం**

**- కోడెల కోసం పచ్చిగడ్డి పెంపకం స్థలాలు పరిశీలిన**

**- జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి : రవీందర్ రెడ్డి**



వేములవాడ,(ప్రశ్న న్యూస్) వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి సంబంధించిన గోశాలలో పనిచేయుట కోసం నియమించిన సిబ్బందికి నియామక పత్రాలను పంపిణీ చేశారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో 40 మందికి గురువారం 38 మంది



సిబ్బందికి గురువారం జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి నియామక పత్రాలు అందజేశారు. వారిని శుక్రవారం (నేటి) నుంచి విధులకు హాజరు కావాలని సూచించారు. వేములవాడ పరిధిలోని హన్మక్కపల్లిలో 25 ఎకరాలు, మర్రిపల్లిలో 40 ఎకరాలు ప్రభుత్వ భూమి కేటాయించారు. దానిలో కోడెల కోసం పచ్చిగడ్డి పెంచాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డికి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించగా. జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్లతో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి గురువారం హన్మక్కపల్లి, మర్రిపల్లిలో కేటాయించిన స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

# చిరు వ్యాపారుల సమస్య కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన : జెబి శౌరి



కొత్తగూడెం (ప్రశ్న న్యూస్) కూలీలైన్ లో పండ్లు, కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న వారిపై సింగరేణి యాజమాన్యం, మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల బాధ్యతారాహిత్యం వల్ల రోడ్డుపై బిక్షాటన చేసే పరిస్థితికి వచ్చిందని తమ భార్యా పిల్లలకి ఒక ముద్ద అన్నం పెట్టుకునే అవకాశం కల్పించాలని కలెక్టర్ కు చిరు వ్యాపారస్తులతో కలిసి టీపీసీసీ సభ్యులు జెబి శౌరి విన్నవించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ త్వరలోనే దీనికి స్పందించి ఈ సమస్యపై ప్రజా ప్రభుత్వంలో ప్రజల వద్దకే పాలన అనే విధంగా అక్కడికి వెళ్లి సమస్య పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు.

# వేములవాడ పట్టణాన్ని టెంపుల్ సిటీగా అభివృద్ధి చేస్తాం

**- దుకాణాలు కోల్పోతున్న వారి సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం ప్రత్యేక ఆలోచన**

**- రాష్ట ప్రభుత్వ విప్ : ఆది శ్రీనివాస్**



వేములవాడ,(ప్రశ్న న్యూస్) వేములవాడ పట్టణాన్ని "టెంపుల్ సిటీ"గా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వెల్లడించారు. గురువారం పట్టణంలోని 13, 14,15,16వ వార్డుల్లో సైడ్ డ్రైన్లు, సీసీ రోడ్లు, కల్వర్టుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. వేములవాడలో 34 కుల సంఘ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, రాష్ట్రంలో ఇదివరకెప్పుడూ ఇంత పెద్ద ఎత్తున కుల సంఘాల అభివృద్ధికి నిధులు కేటాయించలేదని తెలిపారు. సంతోష్‌నగర్ కాలనీలో బతుకమ్మ తెప్ప నిర్మాణానికి మహిళలు చేసిన వినతిని స్వీకరించిన ఆయన, త్వరలోనే నిర్మాణం చేపడుతామని హామీ ఇచ్చారు. గతంలో ఇదే ప్రాంతంలో రూ.15 కోట్లతో మంచినీటి ట్యాంక్ నిర్మించిన విషయాన్ని గుర్తుచేశారు. రాజన్న ఆలయ అభివృద్ధిలో భాగంగా జరుగుతున్న రోడ్డు వెడల్పు పనులపై ఆయన స్పందిస్తూ, కొన్ని కుటుంబాలకు ఇబ్బంది అయినా, ఇది ప్రజల కాంక్ష అయినందున బాధితులతో చర్చించి ముందుకు సాగామని తెలిపారు. దుకాణాలు కోల్పోతున్న వారి పట్ల ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని వెల్లడించారు. అంతేగాక, ఆలయాభివృద్ధికి రూ.76 కోట్ల విలువైన టెండర్ త్వరలోనే కానున్నట్లు వెల్లడించారు. గత పదేళ్లుగా పేద ప్రజలు ఎదురుచూస్తున్న ఇందిరమ్మ ఇల్లు,రేషన్ కార్డులు మంజూరు చేశామని తెలిపారు. ఇంకా ఆయన మాట్లాడుతూ, "రాబోయే ఏ ఎన్నిక వచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతివ్వాలి. ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా

# మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ ఓటర్ జాబితా నుంచి తొలగింపు

**- హైకోర్టు తీర్పు ఆధారంగా రెవెన్యూ శాఖ చర్యలు**

**- హై కోర్టు తీర్పుతో రమేష్ బాబు రాజకీయ జీవితానికి సంకెళ్లు?**

**- పౌరసత్వం పోయే...! ఓటు హక్కూ పోయే...!!**

వేములవాడ,(ప్రశ్న న్యూస్) వేములవాడ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ పేరు ఓటర్ల జాబితా నుంచి తొలగించేందుకు రెవెన్యూ శాఖ ప్రక్రియ ప్రారంభించింది. ఇటీవల తెలంగాణ హైకోర్టు రమేష్ భారత పౌరుడు కాదని స్పష్టం చేసిన తీర్పు నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టారు. ఈ మేరకు వేములవాడలోని ఆయన నివాసానికి రెవెన్యూ అధికారులు ఫారం–7 ప్రకారం నోటీసు జారీ చేశారు. రిజిస్టర్డ్ పోస్టు ద్వారా పంపిన ఈ నోటీసులో, ఓటర్ల జాబితా నుంచి ఆయన పేరు తొలగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇదే సమయంలో, దీనిపై ఎలాంటి అభ్యంతరాలైనా ఉంటే జూలై 2వ తేదీలోపు సమాధానం ఇవ్వాలని సూచించారు. ఈ నోటీసులు, హైకోర్టు ఉత్తర్వుల ఆధారంగా ఎన్నికల శాఖ ఆదేశాలతోనే జారీ చేసినట్లు రెవెన్యూశాఖ తెలిపింది.





**- పౌరసత్వ వివాదం నేపథ్యంలో**

చెన్నమనేని రమేష్ జర్మనీలో పౌరసత్వం పొందిన అనంతరం 2009లో భారత పౌరసత్వం తిరిగి పొందినట్లు పేర్కొంటూ సర్టిఫికెట్ ఆధారంగా భారతీయ పౌరుడిగా ఎన్నికల్లో పోటీ చేశారు. అయితే ఆయన జర్మన్ పాస్‌పోర్టు, విదేశీ పౌరసత్వ రికార్డులు రద్దు చేయకుండానే భారత పౌరసత్వం పొందారని ఆరోపిస్తూ అప్పటి నుంచి వివాదం మొదలైంది. ఈ విషయంలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ 2017లో ఆయన పౌరసత్వం రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రమేష్ దీనిపై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కాగా, పలు విడతల వాదనల అనంతరం ఇటీవల హైకోర్టు ఆయన పౌరసత్వాన్ని చట్టబద్ధంగా కాకపోవడం స్పష్టం చేస్తూ తీర్పు ఇచ్చింది. ఇప్పటివరకు ఈ అంశంపై చెన్నమనేని రమేష్ ఎలాంటి అధికారిక స్పందన ఇవ్వలేదు. ఆయన ఏమైనా స్పందిస్తారా? లేదా ?? అనేది వేచి చూడాల్సిందే..!

# ఆన్‌లైన్‌లో నగ్న వీడియోల అమ్మకాల దందా

**టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడిలో పట్టుబడ్డ భార్యాభర్తలు**

**హైదరాబాద్ అంబర్‌పేటలో నగ్న వీడియోల దందా గుట్టురట్టు**

**ఆన్‌లైన్‌లో న్యూడ్ వీడియోలు స్ట్రీమింగ్ చేస్తూ విక్రయిస్తున్న జంట**

**డబ్బులు చెల్లించిన వారికి వీడియో లింకులు పంపుతున్న వైనం**

**నిందితుల నుంచి కెమెరా, లైవ్ లింక్ పరికరాలు స్వాధీనం**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నగరంలోని అంబర్‌పేటలో దారుణమైన సంఘటన వెలుగులోకి వచ్చింది. ఆన్‌లైన్ వేదికగా సొంత నగ్న వీడియోలను చిత్రీకరించి, వాటిని విక్రయిస్తున్న ఓ జంటను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. సమాజంలో నైతిక విలువలకు తూట్లు పొడుస్తూ సాగుతున్న ఈ అశ్లీల దందా స్థానికంగా కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే అంబర్‌పేటకు చెందిన దంపతులు కొంతకాలంగా ఆన్‌లైన్‌లో తమ నగ్న వీడియోలను స్ట్రీమింగ్ చేస్తున్నట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. డబ్బులు చెల్లించిన వారికి ప్రత్యేకంగా స్ట్రీమింగ్ లింకులను, వీడియోలను పంపుతున్నారని టాస్క్‌ఫోర్స్ అధికారులు నిర్ధారించుకున్నారు. ఈ సమాచారం ఆధారంగా, గురువారం పోలీసులు వ్యూహాత్మకంగా వ్యవహరించి నిందితుల నివాసంపై దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ దందా కోసం ఉపయోగిస్తున్న కెమెరా, లైవ్ లింక్ పరికరాలు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను పోలీసులు ఘటనా స్థలం నుంచి స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన దంపతులను పోలీసులు ప్రస్తుతం విచారిస్తున్నారు. ఈ దందా వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా, ఎంతకాలంగా ఈ కార్యకలాపాలు సాగిస్తున్నారు అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోందని పోలీసు వర్గాలు తెలిపాయి.

# యువత మత్తుకు దూరంగా ఉండాలి




కొత్తగూడెం (ప్రశ్న న్యూస్) అంతర్జాతీయ మాదక ద్రవ్య నిర్మూలన దినోత్సవం సందర్భంగా భద్రాద్రి జిల్లా కొత్తగూడెంలోని 34 వార్డు కూలీలైన్ లో పారలీగల్ వాలంటరీ అమడగాని రాజకుమారి ఆధ్వర్యంలో మాదకద్రవ్యలు వాడడం వల్ల జరిగే నష్టాలను వివరిస్తు డ్రగ్స్, మత్తు పదార్థాల వాడకాన్ని యువత వ్యతిరేకించాలని డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన ఆమె తెలిపారు. ఐయామ్ యాంటీ డ్రగ్ అంటూ వాటికి అలవాటైన వారి కుటుంబాలు చిన్నాభిన్నం అవ్వడమే కాకుండా ఆరోగ్యాలు క్షీణిస్తాయని వీటి వలన ఎంతో మంది యువత వాళ్ళ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని కాబట్టి విద్యార్థులు యువకులు డ్రగ్స్ గంజాయి మద్యం సిగరెట్స్ వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా మీ కుటుంబానికి దేశానికి ఆదర్శంగా ఉండాలని కోరారు ఈ కార్యక్రమంలో లీగల్ వాలంటరీ బి భారతి, గరిగ భాగ్యలక్ష్మి, బస్తి మహిళలు యువకులు పాల్గొన్నారు.

# యువత డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్ధాలకు బానిస కావద్దు

**డ్రగ్స్ రహిత జిల్లా లక్ష్యంగా ముందుకు..**

**మంథనిలో యాంటీ డ్రగ్ డే ర్యాలీ**




మంథని ( ప్రశ్న న్యూస్) దేశ భవిష్యత్తును నిర్ణయించేది యువతేనని అంతర్జాతీయ మాదక ద్రవ్యం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని మంథని సర్కిల్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. మాదక ద్రవ్యాల నిర్మూలన అవగాహన 2కె రన్ మంథని పట్టణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి డిసిపి కరుణాకర్ హాజరై గోదావరిఖని ఎసిపి ఎం.రమేష్ తో పాటు పోలీస్ అధికారులతో కలిసి జెండా ఊపి రన్ ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతు ..దేశ భవిష్యత్తును నిర్ణయించేది యువత అని అలాంటి యువత డ్రగ్స్,గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసలై వారి భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని సూచించారు. చెడు వ్యసనాలకు బానిసలై అనారోగ్యం పాలవుతు బంగారు భవిష్యత్తును కోల్పోవడమే కాకుండా, ఎన్నో చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలు చేస్తు తమ చేతులారా భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారని,దానికోసమే ముందుగానే మత్తు పదార్థాలను నిర్మూలించి యువతను మత్తు అనే మహమ్మారి నుండి కాపాడుకోవాలని సూచించారు.

యాంటీ డ్రగ్ డే వారోత్సవాలలో భాగంగా కాకుండా పెద్దపల్లి జిల్లా డ్రగ్ ఫ్రీ జిల్లాగా మార్చే వరకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, భావితరాలకు డ్రగ్ ఫ్రీ సమాజాన్ని అందించాలని అన్నారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి వంటి ఇతర మాదక ద్రవ్యాలను విక్రయించిన, అక్రమ రవాణా చేసిన, వినియోగించినట్లు గుర్తించినట్లైతే వెంటనే పోలీస్ కు సమాచారం అందించవలసిందిగా సూచించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న అన్ని విధ్యాసంస్థల యాజమాన్యాలకు విద్యార్థిని, విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. యాంటీ డ్రగ్ డే సందర్భంగా రన్ కు హాజరైయన యువత,ప్రజలు వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు నో టూ డ్రగ్ %ా% ఎస్ టూ లైఫ్ నినాధంతో ప్రతిజ్ఞ చేస్తూ.. మీ చుట్టూ ప్రక్కల ఉన్న వారికి అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమలో మంథని సీఐ రాజు, గోదావరిఖని టూ టౌన్ ఇన్స్ పెక్టర్ ప్రసాదరావు, రామగిరి ఎస్సై శ్రీనివాస్, దివ్య, మంథని ఎస్ఐ రమేష్, ముత్తారం ఎస్సై నరేష్, యువత, స్థానిక ప్రజలు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# పెద్ద పెద్ద బ్లాస్టింగ్ శబ్దాలతో ఉక్కిరి బిక్కిరవుతున్నాం:బండమదారం ప్రజలు

- క్రషర్ మిషన్, క్వారీలను పరిశీలించిన అధికారులు
- పరిమితికి మించి బ్లాస్టింగ్లు చేస్తున్న రాక్ సాండ్, రోబో సాండ్, గెలాక్సి సాండ్ క్రషర్లు







**మేడ్చల్ ( ప్రశ్న న్యూస్)** క్రషర్ మిషన్ వల్ల వచ్చే దుమ్ముతో పాటు క్వారీలలో పెద్ద పెద్ద బ్లాస్టింగ్ శబ్దాలతో తమ గ్రామాలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నాయని, తమ గ్రామాలను బ్లాస్టింగ్ శబ్దాలతో పాటు, దుమ్ముల భారిన పడకుండా చర్యలు తీసుకోవాలని మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కలెక్టర్ కు బండమాదం గ్రామం ప్రజలు ఫిర్యాదు చేశారు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుతో జిల్లా మైనింగ్ అదికారి సైదులు, కాలుష్య నియంత్రణ అధికారిణి స్వప్న, పలువురు అధికారులు గురువారం మేడ్చల్ మండల రెవిన్యూ పరిధిలోని గిర్మాపూర్, రాయిలాపూర్, బండ మాదారం గ్రామాలలో ఉన్న క్వారీలతో పాటు క్రషర్ మిషన్ లను పరిశాలించారు. ఈ మూడు గ్రామాల్లోని రాక్ సాండ్, రోబో సాండ్, గెలాక్సి సాండ్ క్రషర్ మిషన్ లు చేస్తున్న పరిమితి మించి బ్లాస్టింగ్లు, క్రషర్ మిషన్ వల్ల వస్తున్న దుమ్ముతో పాటు పరిమితి మించి టిప్పర్ లలో డస్ట్ తరలించడం వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదుతో అధికారులు స్పందించి మూడు గ్రామాల్లో ఉన్న ఇళ్లను, క్రషర్ మిషన్ లను, క్వారీలను పరిశీలించారు.

## క్రషర్ మిషన్ వల్ల, పెద్ద పెద్ద బ్లాస్టింగ్ వల్ల రోగాల భారిన పడుతున్నాం

మేడ్చల్ మండలం రెవిన్యూ పరిధిలోని గిర్మాపూర్, రాయిలాపూర్, బండమాదారం గ్రామాలలో ఉన్న క్వారీలతో పాటు క్రషర్ మిషన్ ల వల్ల మూడు గ్రామాల ప్రజలందరు రోగాల బారిన పడుతున్నారని గ్రామస్థులు ఆవేధన వ్యక్తం చేశారు. క్రషర్ మిషన్ లు క్వారీలలో పరిమితిని మించి చేస్తున్న బ్లాస్టింగ్ వల్ల తన గ్రామాల్లోని ఇళ్లకు పగుళ్లు ఏర్పడుతున్నాయని బాధితులు వాపోయారు. దీంతో పాటు క్రషర్ మిషన్ల వల్ల తినే ఆహారంతో పాటు, ఇంట్లోని పాత్రలపై దుమ్ము వచ్చి చేరుతుందన్నారు. రోజంతా దుమ్ములోనే బతకాల్సి వస్తుందని, గ్రామంలోని చాలా మంది రోగాల భారిన పడ్డ రోజులు కూడా ఉన్నాయన్నారు. క్రషర్ మిషన్ లు ఏర్పాటు చేసిన టిప్పర్లలో 20 టన్నులకు బదులు 40 టన్నుల డస్ట్, కంకర తీసుకెల్తున్న సమయంలో రోడ్లపై పడిపోతుందని, ఆ రోడ్లపై వాహనాలు నడిపితే రోడ్డు ప్రమాదాలు కూడా జరిగాయని గ్రామస్తులు తెలిపారు. మితిమీరిన శబ్దాలు చేసే బ్లాస్టింగ్ ల వల్ల ఇళ్ల పై కప్పులు పెచ్చులూడడంతో పాటు, ఇళ్లకు పగుళ్లు ఏర్పడుతున్నాయన్నారు. దీనిపై గ్యాలక్సీ సాండ్ క్రషర్ మిషన్ వారికి చెప్తే ఈ క్రషర్ మిషన్ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే దని ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకొండని బెదిరిస్తున్నారని గ్రామస్తులు ఆవేధన వ్యక్తం చేశారు. ఈ క్రషర్ మిషన్ లపై అధికారులకు గత కొన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని తమ గ్రామాల్లోని ప్రజలను కాపాడాలన్నారు

# జగిత్యాల జిల్లా పోలీసు శాఖ డ్రగ్స్, గంజాయి నివారణకు ఉక్కు పాదం : ఎస్పీ అశోక్ కుమార్

**-జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్,**
**-జగిత్యాల జిల్లా కేంద్రం లో ఘనంగా ప్రపంచ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవ వేడుకలు**
**-మాదకద్రవ్యాల నిర్మూలన అవగాహన ర్యాలీ**





**జగిత్యాల జిల్లా (ప్రశ్న న్యూస్)** ప్రపంచ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ర్యాలీని స్థానిక శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ , జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ జండా ఊపి ప్రారంభించారని తెలిపారు.ఈ ర్యాలీ మున్సిపల్ పార్క్ నుండి మినీ స్టడియం వరకు నిర్వహించడం జరిగిందని తెలిపారు.మత్తుపదార్థాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్తును అంధకారం చేసుకోకూడదని విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం ప్రతిజ్ఞ చేసి,యాంటి డ్రగ్స్ సోల్జర్ గా సైన్ చేశారు. ప్రపంచ మాదకద్రవ్యాల నివారణ దినోత్సవం ను పురస్కరించుకొని డ్రగ్స్ కు యువత బానిస కావద్దు- బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ యువతకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే పరిణామాల పై అవగాహన చేయడంతో పాటు వినియోగించడం వల్ల కలిగే నష్టలపై యువతకు, పాఠశాల, కళాశాల విద్యార్థులకు దిశా నిర్దేశం చేసే కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించడం జరుగుతుందని, పోలీస్ కళాబృందం జిల్లా లో ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై అనునిత్యం దృష్టిపెట్టాలని ప్రవర్తనలో మార్పులు ఎప్పటికప్పుడు గమనిస్తు సరైన మార్గ నిర్దేశం చేయాలని సూచించారు. మాదకద్రవ్యాలు అమ్మడం, సేవించడం రెండు నేరమని అన్నారు. జిల్లాలో డ్రగ్స్ రహిత వాతావరణ నెలకొల్పేందుకు ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందిని వివిధ శాఖల అధికారులతో కలిసికట్టుగా పని చేసి డ్రగ్స్, గంజాయి రహిత జిల్లాలుగా మార్చడం జరుగుతుందని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. సమాజంలో జరుగుతున్న చాలావరకు నేరాలు మత్తు పదార్థాలకు బానిస అయిన వారు చేసినవే అని మత్తు పదార్థాలు ఉపయోగించడం ద్వారా యువత తమ యొక్క ఉజ్వల భవిష్యత్తుని కోల్పోతున్నారని యుక్త వయసులో తెలిసి తెలియక వివిధ ప్రభావాల వల్ల చెడు అలవాట్లకు ఆకర్షితులు అయ్యే అవకాశం ఉంట్టుందని చెడు అలవాట్లను దూరం చేసుకొన మంచి అలవాట్లను ద్వారా మాత్రమే ఉన్నత స్థాయికి రాగలుగుతారని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. డ్రగ్స్ జీవితాన్ని నాశనం చేయడంతో పాటు భవిష్యత్ లేకుండా చేస్తుందనే విషయాన్ని యువత గ్రహించి అలాంటి చెడు అలవాట్లకు ఆకర్షితులవ్వద్దని విజ్ఞప్తి చేశారు.సమాజంలోని మాదకద్రవ్యాల ముప్పును అంతం చేసే లక్ష్యంలో యువత భాగస్వామ్యం కావాలని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ అన్నారు.తల్లిదండ్రులు నమ్మకంతో ఇచ్చిన స్వేచ్ఛను విద్యార్థులు దుర్వినియోగం చేసుకోకుండా ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేయాలని అన్నారు.ఈ విషయంలో ప్రభుత్వం చాలా కఠినంగా వ్యవహరిస్తుందని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ అన్నారు.

# కాళేశ్వరం,ఫోన్ ట్యాపింగ్ కేసులను సీబీఐతో దర్యాప్తు జరపాలి

**హైదరాబాద్** తెలంగాణలో జరిగిన కుంభకోణాలు,కాళేశ్వరం,ఫోన్ ట్యాపింగ్ కేసులను సీబీఐ తో దర్యాప్తు జరపాలని తెలంగాణ బిజెపి ఉపాధ్యక్షులుఎన్.వి.ఎస్.ఎస్ ప్రభాకర్ డిమాండ్ చెసారు.కాంగ్రెస్ బిఆర్ ఎస్ కుమ్మక్కయ్యాయి కాబట్టే తెలంగాణ ప్రభుత్వ దర్యాప్తు తేలడం లేదుకెసిఆర్ హయంలో జరిగిన కుంభకోణాలపై అసెంబ్లీ కి రావాలని చర్చలకు రావాలని రేవంత్ పిలుస్తున్నారు తప్ప కేసీఆర్ పై చర్యలు తీసుకోవడం లేదుతెలంగాణ ఏర్పడిన తరువాత 10 ఏళ్లు కృష్ణ,గోదావరిపై ప్రాజెక్టులు పూర్తి చేయకపోవడం వల్ల తెలంగాణకు నష్టం జరిగిందని పేర్కొన్నారు.కృష్ణ,గోదావరి నీరు,నీటి ప్రాజెక్టుల గురించి మాట్లాడే నైతికత కేసీఆర్,హరీష్ రావుకు లేదుఫోన్ల ట్యాపింగ్ కేసు విచారణ పరిధిని తెలంగాణ ప్రభుత్వం తక్కువ చేసి చూపుతున్నట్లు కనిపిస్తుందిఅవినీతి,లిక్కర్ సేల్స్,ప్రభుత్వ భూముల అమ్మకాలు,అరాచకాలు,ఆత్మహత్యల్లో తెలంగాణ రైజింగ్ లో ఉందిబీర్ల,భూముల అమ్మకాల ద్వారా ఖజానా నింపుకోవాలని కాంగ్రెస్ చూస్తుందని ఆరోపించారు.ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం పై సీబీఐ విచారణ జరిపితేనే అసలు దోషులు బయటపడతారు,కాళేశ్వరం విషయం న్యాయ విచారణ, ఇంజనీర్ల పై తోసే విషయం కాదుకాళేశ్వరం అవినీతి విషయంలో సరైన సమయం లో కేంద్రం నిర్ణయం తీసుకుందికేంద్రం కాళేశ్వరం అవినీతి పై సిబిఐ దర్యాప్తుకు ఆదేశిస్తుందని భావిస్తున్నామెట్రో ఫేస్ 2 డీపీ ఆర్ కేంద్రానికి సకాలంలో ఇవ్వకపోవడం వల్ల ఆలస్యం జరుగుతుందన్నారు.

కేబినెట్ కి మంత్రిత్వ శాఖ నుంచి ప్రతిపాదనలు వస్తేనే కేబినెట్ నిర్ణయం తీసుకుంటుందిగత ప్రభుత్వ తప్పులు బయటపడతాయని బనక చర్ల అంశాన్ని బిఆర్ ఎస్ తెరమీదికి తెచ్చిందికృష్ణా ,గోదావరి నది జలాల విషయంలో తెలంగాణ కు అన్యాయం జరగకుండా బీజేపీ చూస్తుందిఅవినీతి అంశాలపై నేరుగా సుమోటోగా సీబీఐ దర్యాప్తు చేసే పరిస్థితి లేదుసీబీఐ తో దర్యాప్తు చేయాలని రాహుల్ గాంధీ,రేవంత్ డిమాండ్ చేశారు..కాంగ్రెస్,బిఆర్ ఎస్ కుమ్మక్కయ్యారు కాబట్టే అవినీతి విచారణలు తేలడం లేదు..ఇందుకు విద్యుత్ కొనుగోళ్ల అవినీతి కేసు విచారణ నిదర్శన మన్నారు.

# డ్రగ్స్ వాడకం పెను ప్రమాదం

## డ్రగ్స్ కు బానిసవుతున్న యువత

### కుటుంబం విధ్వంసం కుటుంబాలలో కలహాలు

### ముగిసిన డ్రగ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం

"మత్తు గమ్మత్తు.. అది మనిషిని మైమరిపిస్తుంది. ఒకప్పుడు బాధ కలిగితే మనసును బుజ్జగించడానికి మందు తాగేవారు. సంతోషం వచ్చినా.. దుఃఖం కలిగినా తాగేస్తున్నారు. ఇప్పుడు ప్రపంచంలో మద్యానికి అప్‌డేషన్ వర్షన్ డ్రగ్స్. చిత్రపరిశ్రమలో కొందరు డ్రగ్స్ మాఫియా విషకౌగిలిలోకి వెళ్లిపోయారు. రేవ్ పార్టీలు పెట్టేయడం ట్రెండ్ అయిపోయింది. ఇంతలా మత్తులో జోగడం.. ప్రపంచానికి పెనువిపత్తే ! అందులోనూ శక్తివంతమైన యువత ఈ మత్తు ప్రపంచంలో ఊగుతుంటే నష్టమేగా ! అందుకే మత్తు వదలాలి.. వదిలించాలి.. జూన్ 26వ తేదీన 'అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం' సందర్భంగా " ప్రజా ప్రశ్న" కథనం"



**హైదరాబాద్ ( ప్రశ్న న్యూస్)** నేడు యువత, ప్రత్యేకంగా కొందరు సెలబ్రిటీస్ మత్తు ప్రపంచంలో ఓలలాడుతున్నారు. డ్రగ్స్ ఒకసారి శరీరంలోకి ఎంటరయ్యాక.. వారికి కనపడేది మత్తు ప్రపంచమే. బడిపిల్లలకు సైతం డ్రగ్స్ చాక్లెట్స్ రూపంలో చేరువ చేస్తున్న దారుణమైన స్థితిలో నేడు ఉన్నాం. పసితనం ఈ మత్తు పదార్థాలతో వసివాడిపోతోంది. ఈ దారుణాలను అరికట్టాలంటే పగడ్బందీ చర్యలు అత్యవసరం.

### నాడు టాలీవుడ్‌లో కలకలం..

ఒక్కసారి గతంలోకి తొంగి చూస్తే.. అది 2017 టాలీవుడ్‌లో డ్రగ్స్ కలకలం రేగింది. ఒక డ్రగ్స్ రాకెట్ ముఠాను పట్టుకుంటే.. వారెవరికి సప్లయి చేస్తున్నారనేది అన్నీ విచారణలో వెల్లడయ్యాయి. అప్పుడు పూరీ జగన్నాథ్, ఛార్మి, ముమైత్ ఖాన్, రవితేజ ఇంకా బుల్లి బుల్లి తారల పేర్లు చాలానే ముందుకు వచ్చాయి. అంటే టాలీవుడ్‌లోనూ పార్టీలు జరుగుతాయి.. అక్కడా డ్రగ్స్ వాడతారనే విషయం అప్పుడే లోకానికి తెలిసింది. ఇక్కడ రాజకీయ సర్దుబాటు జరిగింది. బడాబాబుల పేర్లు బట్టబయలు కావడం.. వారంతా పాలకులని వేడుకుని.. భారీగా చెల్లింపులు చదివించి, తమ పిల్లలను బయటపడేలా చేసుకున్నారు. ఆ కేసును పట్టుదలగా ఇన్వెస్టిగేట్ చేసిన అకున్ సబర్వాల్ ఏమైపోయారో కూడా చూశాం. ఈ సందర్భంగానే స్కూల్ పిల్లలకూ ఈ డ్రగ్స్ చాక్లెట్స్ రూపంలో చేరవేస్తున్నారన్న విషయం వెలుగులోకి వచ్చింది.

### బెంగళూరు రేవ్ పార్టీ..



బెంగళూరు ఎలక్ట్రానిక్ సిటీ సమీపంలోని ఓ ఫాం హౌస్‌లో జరిగిన రేవ్ పార్టీలో ఐదుగురిని పోలీసులు నిందితులుగా చేర్చిన విషయం తెలిసిందే. అయితే రేవ్ పార్టీలో కీలక సూత్రధారి విజయవాడ వాసి లంకపల్లి వాసుగా పోలీసులు గుర్తించారు. విజయవాడలోనూ అతిపెద్ద బుకీల నెట్‌వర్క్‌ను వాసు విస్తరించాడు. పైకి మాత్రం వ్యాపారం, ఫార్మా రంగాల పేర్లను ఉపయోగించుకుంటున్నాడని, డీజీపీ కార్యాలయంలో కొంత మంది అధికారుల పేర్లను వాసు ఉపయోగించుకున్నట్లు పోలీసులు గుర్తించారు. బెట్టింగ్‌లతో పాటు డ్రగ్స్ వ్యవహారంలోనూ వాసు కీలక సూత్రధారి. ఇందులో సినీనటి హేమతో పాటు మొత్తం 86 మందికి, అందులోనూ తెలుగు వారందరికీ పాజిటివ్ వచ్చింది. అప్పుడిక రంగంలోకి దిగిన పోలీసులు పాజిటివ్ వచ్చిన వారందరికీ నోటీసులు ఇవ్వడం.. విచారణకు హాజరుకావాలని ఆదేశించారు.

### ఎందుకు అడిక్ట్ అవుతున్నారు..

అసలు సెలబ్రిటీస్ ఎందుకు ఈ డ్రగ్స్ ఉచ్చులో పడుతున్నారు ? దీనికి బాలీవుడ్, టాలీవుడ్ అని తేడా లేకుండా ఎలా దీనికి అడిక్ట్ అవుతున్నారు ? ఇవే ప్రశ్నలు వేధిస్తున్నాయి. ఎందుకంటే మామూలుగా అయితే.. ఎవడైనా బాధలో ఉంటే మందు తాగుతాడు. అలా బానిసైపోయి.. అదే బాగుందనుకుని కంటిన్యూ చేస్తాడు. చివరకు ఆరోగ్యం పాడై.. శాశ్వతంగా దూరమవుతాడు. ఇది మనకు ఎప్పటి నుంచో తెలిసిన కాన్సెప్ట్. కానీ ఇప్పుడు మనం పరిశీలిస్తే.. బాధే కాదు.. ఆనందం వచ్చినా మందు తాగుతున్నారు. అసలు నలుగురు కలిస్తే చాలు మందు కొట్టడం చేస్తున్నారు.

### గుర్తించడమెలా..

యుక్త వయస్కులు, చిన్న పిల్లలు మాదక ద్రవ్యాల బారిన పడటం ఆందోళన కలిగించే విషయమని వైద్య నిపుణులు చెప్తున్నారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడటం వల్ల ఆకలి తగ్గిపోతుంది. నిద్ర పట్టదు. అల్సర్లు, క్రామ్ప్స్ వస్తాయి. జ్ఞాపక శక్తి తగ్గిపోతుంది. నిద్రలో సమస్యలు, మానసిక ఒత్తిడి, మూడ్ స్వింగ్స్, అందరితో పోట్లాటలు చేస్తారు. చేతులు, కాళ్ళు వణకడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. జుట్టు ఎండిపోతుంది, వయసు మీరిపోయినట్లు కనిపిస్తారు.మాటలో తడబాటు కలుగుతుంది. కళ్ల కింద నల్లని వలయాలు ఏర్పడతాయి. కొంత మంది డ్రగ్స్ కొనుక్కోవడం కోసం దొంగతనాలు చేయడమూ మొదలుపెడతారని నిపుణులు చెప్తున్నారు. మాదకద్రవ్యాలు తీసుకోవడం వల్ల నిజమైన ఆనందాన్ని కోల్పోవడం, వాటిని సంపాదించడం కోసం సమయాన్ని వినియోగించడం, కోపంగా, దురుసుగా ప్రవర్తించడం, వాటి ప్రభావంలో ప్రమాదాలకు గురి కావడం లాంటివీ జరుగుతూ ఉంటుంది. కొంత మందికి ఫిట్స్ కూడా వస్తాయని వైద్య నిపుణులు చెప్తున్నారు. మాదకద్రవ్యాలు తీసుకునే వారికి ఆత్మహత్య చేసుకునే ముప్పు కూడా ఉంటుందని తెలిపారు. ఇంజెక్షన్ల ద్వారా హెచ్ఐవి లాంటి ముప్పు పొంచి ఉందని వారు హెచ్చరిస్తున్నారు. గంజాయి లాంటివి తీసుకునేటప్పుడు స్కిజోపెర్నియాలాంటి తీవ్రమైన మానసిక సమస్యలు కనిపించడంతో పాటు మూడ్‌లో మార్పులు, మానసిక ఒత్తిడి, ఆందోళన కలుగుతాయి. ఇవి నరాలను ఉద్రేకపరిచి గుండె కొట్టుకునే వేగాన్ని పెంచుతాయి. దీని వల్ల గుండె పోటు వచ్చే అవకాశముందని అంటున్నారు

## జిహెచ్ఎంసి సర్కిల్ -18 ఏసిపి పై

# యుద్ధానికి సిద్ధమంటున్న టిజెఎస్ఎస్

- టౌన్ ప్లానింగ్ ఏసీపీ ల అవినీతిపై కమిషనర్ స్పందించాలి
- జిహెచ్ఎంసిలో విజిలెన్స్ అవినీతి అక్రమాలను పట్టించుకోదా.?
- టౌన్ ప్లానింగ్ ఏసిపి, సెక్షన్ ఆఫీసర్, చైన్ మెన్ ల అవినీతి ఆస్తులు కోట్లలోనే



హైదరాబాద్(ప్రశ్న న్యూస్) గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సర్కిల్ 18 ఏసిపి పై తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం నాయకులు లిఖితపూర్వక ఫిర్యాదులతో జిహెచ్ఎంసి లో అలజడి మొదలైంది. ఏసిపి ఇంజా శ్రీనివాస్ చేసే అవినీతి అక్రమాలు పై పూర్తిస్థాయిలో ఏసీబీ, విజిలెన్స్ విచారణ జరపాలంటూ లిఖిత పూర్వకంగా ఫిర్యాదుల వెలువ .నిజాయితీగా వార్తలు రాసే మీడియా ప్రతినిధులను బెదిరింపులకు గురి చేస్తున్న అసిస్టెంట్ సిటీ ప్లానర్ నింజా శ్రీనివాస్ ఇప్పటికైనా తన బుద్ధి మార్చుకొని పత్రికా విలేకరులపై ఎదురుదాడి చేసే దానికంటే అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేసే విధంగా తన తీరు మార్చుకుంటే బాగుంటుంది. జీతం తీసుకుంటుంది జిహెచ్ఎంసి నుండి పనిచేస్తుంది అక్రమ నిర్మాణదారుల కోసం సొమ్మొకడిది సోకొకడిది అన్నట్టు వ్యవహరిస్తున్న సర్కిల్ 18 ఏసిపి పై మరిన్ని ఫిర్యాదులకు సిద్ధమైన తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం టౌన్ ప్లానింగ్ అంటేనే నగరవాసుల్లో ఒక గుబులు ఉంది. అందులో మరి సర్కిల్ 18 జూబ్లీహిల్స్ అంటే అమ్మో అమ్మమ్మో అని అరిచే విధంగా తయారైంది. జిహెచ్ఎంసి లోని టౌన్ ప్లానింగ్ విభాగము నందు విచ్చలవిడిగా అవినీతి జరుగుతున్న ఉన్నతాధికారులు ఎందుకు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారు.? అంతుచిక్కని ప్రశ్నగా మారింది. వాట్సాప్ గ్రూపులో ఇంజ శ్రీనివాస్ చేసిన పసలేని ఆరోపణలను ఎదిరిస్తూ జిహెచ్ఎంసి లోని ఉన్నతాధికారులందరినీ టీజేఎస్ఎస్ ఏసీపి పై ఫిర్యాదుల వెళ్ళువా మొదలెట్టింది. ఉన్నతాధికారులందరూ ఇప్పటికైనా త్వరితగతిన స్పందించి సర్కిల్ 18 ఏసిపి జిహెచ్ఎంసి రూల్ బుక్ ప్రకారం వ్యవహరించే విధంగా శాఖా పరమైన చర్యలు తీసుకుంటారని జర్నలిస్టు సంఘాలు తమ ఆవేదనను వ్యక్తపరుస్తున్నారు. అదేవిధంగా ఇంజ శ్రీనివాస్ అవినీతి అక్రమాలపై ఏసీబీ విచారణ చేయించాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఏసీబీ డీజీకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని ఈ సందర్భంగా టీజేఎస్ఎస్ సభ్యులు డిమాండ్ చేశారు.

## ఆ తర్వాత ముఖ్యమంత్రి

# అయ్యేందుకు ప్రయత్నిస్తా

- జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి రాష్ట్ర రాజకీయాల్లో ఒక ఆసక్తికరమైన చర్చకు తెరలేపారు. ముఖ్యమంత్రి పదవిపై తన ఆకాంక్షను పరోక్షంగా వెల్లడిస్తూనే, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. గురువారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి పదవి గురించి జగ్గారెడ్డి మాట్లాడుతూ, వచ్చే మూడేళ్లు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉంటారని, ఆ తర్వాత ఐదేళ్ల కాలానికి కూడా ముఖ్యమంత్రి కావడానికి ఆయన ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. అయితే, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పదవి నుంచి దిగిపోయిన తర్వాత తానూ ముఖ్యమంత్రి అయ్యేందుకు ప్రయత్నిస్తానని జగ్గారెడ్డి పేర్కొన్నారు. ఆ సమయంలో తన అభ్యర్థిత్వాన్ని ప్రజల ముందు ఉంచుతానని ఆయన వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేస్తున్న వ్యాఖ్యలపై జగ్గారెడ్డి తీవ్రంగా స్పందించారు. కవిత ప్రతి విషయాన్ని అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఆమె బీఆర్ఎస్‌లో ఉన్నా బయటకు వచ్చినా పెద్ద తేడా ఏమీ ఉండదని అన్నారు. కవిత మాట్లాడే మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయని విమర్శించారు. సాధారణంగా తండ్రి రాజకీయ వారసత్వం కుమారుడికి వస్తుందని, ఒకవేళ కుమారుడు లేకపోతే కుమార్తెకు అవకాశం దక్కవచ్చని వ్యాఖ్యానించారు. తాము స్పందించే స్థాయి నాయకురాలు కవిత కాదన్నది తమ అభిప్రాయమని జగ్గారెడ్డి అన్నారు. కవిత ఎందుకు ఇంత పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సమాన ప్రాధాన్యత కలిగిన నేతలని, వారు రాజకీయంగా ఒకరినొకరు విమర్శించుకుంటే అర్థం ఉంటుందని తెలిపారు. తమ గురించి కవిత అనవసరంగా ఎందుకు మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. "హాయిగా బతుకమ్మ ఆడుకోకుండా కవితకు ఈ పంచాయితీ ఎందుకు?" అని నిలదీశారు. ఢిల్లీ మద్యం కుంభకోణం వ్యవహారంలో కవిత ప్రమేయంపై జగ్గారెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ స్కాంలో పెట్టుబడులు పెట్టడానికి కవితకు ఇన్ని వందల కోట్ల రూపాయలు ఎక్కడి నుంచి వచ్చాయని ఆయన ప్రశ్నల వర్షం కురిపించారు.

## రాజకీయ నాయకుని ముసుగులో

# రహదారిపై అక్రమ నిర్మాణం

- కోర్టు స్టే ఉందంటూ కమర్షియల్ భారీ నిర్మాణం చేశారు
- కోర్టు స్టే తొలగింపునకు టౌన్ ప్లానింగ్ అధికారులు పార్వైజ్ రిపోర్టు పంపారా.?
- కోర్టు స్టే తొలగించే వరకు బిల్డింగ్ ఎవరికి అద్దెకు ఇవ్వవద్దని అమ్మ వద్దని బోర్డు ఏర్పాటు ఎందుకు చేయలేదు
- కాప్రా సర్కిల్ టౌన్ ప్లానింగ్ లో అంత అయోమయం గందరగోళం

నాచారం (ప్రశ్న న్యూస్) కాప్రా సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలకు కొదవ లేకుండా పోయింది. రహదారులే కేంద్రంగా అక్రమ సెల్లార్లు, అక్రమ అంతస్తులు, అక్రమ నిర్మాణాలు రెసిడెన్షియల్ అనుమతులు తీసుకొని కమర్షియల్ నిర్మాణాలు యదేచ్చగా చేస్తుంటే చర్యలు తీసుకోవలసిన కాప్రా సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికుల ఆరోపిస్తున్నారు. నాచారం రహదారిపై రెసిడెన్షియల్ అనుమతులు తీసుకొని స్టిల్ట్ లో షెటర్లు వేయడంతోపాటు అక్రమ సెల్లార్ నిర్మాణం చేశారని రెండు నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోమంటే దీని వెనుక ఓ రాజకీయ నాయకుని హస్తము ఉందని అధికారులు తెలపడంపై స్థానికులు మండిపడుతున్నారు. రాజకీయం ముసుగులో అక్రమాలు చేయడం తప్ప ప్రజాసేవ చేయడం చేతగాని చాలామంది నాయకులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నారు. ప్రజల సమస్యలపై ఒకరోజు మాట్లాడరు, ఒక ఫిర్యాదు చేయరు కానీ అక్రమ నిర్మాణాలకు అండగా నిలబడుతూ కద్దర్ చొక్కా వేసుకొని నాయకులం అంటూ రాజకీయం అంటేనే అసహ్యం వేసే విధంగా అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ఈ అక్రమ నిర్మాణంపై ప్రజా ప్రశ్న దినపత్రికలో జూన్ 16న కథనం వచ్చిన టౌన్ ప్లానింగ్ అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పాటు కోర్టు స్టే ఉందని తెలపడం విస్మయాన్ని కలిగిస్తుంది. కోర్టు స్టే ఉంటే నిర్మాణం ఎలా జరిగిందని కోర్టు స్టే పేరుతో అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని మరి స్టే తొలగింపునకు టౌన్ ప్లానింగ్ అధికారులు పరవైజ్ రిపోర్ట్ పంపారా.? లేదా.? అన్న దానిపై వివరణ ఇవ్వడం లేదని స్థానికులు మండిపడుతున్నారు.



ప్రజాప్రశ్న

రహదారిపై అక్రమ నిర్మాణాలు

పట్టించుకోని అధికారులు

కోర్టు స్టేకు స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుల అవినీతి తోడు కావడంతో అక్రమ నిర్మాణాలు భారీగా జరుగుతున్నాయని స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుల సహకారంతోనే జిహెచ్ఎంసి కి భారీగా నష్టం వాటిల్లుతుంది. ఒక్క స్టే ని కూడా వెకెట్ చేయించకుండా భారీగా లంచాలు తీసుకొని కౌన్సిల్ సభ్యులు అవినీతి అక్రమాలు చేస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నాచారం టౌన్ ప్లానింగ్ అధికారులు ఈ అక్రమ నిర్మాణం పై చర్యలు తీసుకోవాలని అలాగే ఈ అక్రమ నిర్మాణం కోర్టులో ఉన్నందున ఎవరికి అద్దెకి ఇవ్వబడును బోర్డు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



## అంతరిక్షంలోకి దూసుకెళ్లిన

# శుభాంశు శుక్లా

-ఐఎస్ఎస్ నుంచి భారత్‌కు ప్రత్యేక సందేశం



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) నుంచి భూమిని వీక్షించే అరుదైన అవకాశం దక్కించుకున్న కొద్దిమందిలో ఒకరిగా నిలవడం తన అదృష్టమని భారత వ్యోమగామి శుభాంశు శుక్లా సంతోషం వ్యక్తం చేశారు. యాక్సియం-4 మిషన్‌లో భాగంగా ఆయన తొలిసారిగా ఐఎస్ఎస్‌లో అడుగుపెట్టారు. భూమి నుంచి సుమారు 28 గంటల సుదీర్ఘ ప్రయాణం అనంతరం అంతరిక్ష కేంద్రానికి చేరుకున్న శుభాంశు, అంతరిక్షంలోకి వెళ్లిన 634వ వ్యక్తిగా చరిత్ర సృష్టించారు. ఐఎస్ఎస్‌లోకి ప్రవేశించిన వెంటనే అక్కడున్న ఇతర వ్యోమగాములతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా శుభాంశు శుక్లా మాట్లాడుతూ, "ప్రియమైన నా తోటి భారతీయులకు నాదొక చిన్న సందేశం. నేను 634వ వ్యోమగామిని. ఇక్కడకు రావడం చాలా గర్వంగా ఉంది. మీ అందరి ప్రేమ, ఆశీస్సుల వల్లే నేను ఐఎస్ఎస్‌కు చేరుకోగలిగాను. ఇక్కడ నిలబడటం చూడటానికి తేలికగానే ఉన్నప్పటికీ, నా తల కొంచెం భారంగా కాస్త ఇబ్బందిగా అనిపిస్తోంది. ఇవి చాలా చిన్న విషయాలు, కొన్ని రోజుల్లో అన్నీ అలవాటైపోతాయి. ఈ ప్రయాణంలో ఇది కేవలం తొలి అడుగు మాత్రమే. రాబోయే రోజుల్లో మేమంతా కలిసి శాస్త్రీయ పరిశోధనలు చేపడతాం. మీతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూనే ఉంటాను. ఈ ప్రయాణం చాలా అద్భుతంగా, ఉత్తేజభరితంగా ఉంది. నా భుజంపై భారత పతాకాన్ని ఎంతో గర్వంతో ధరించాను. నా ప్రయాణం పట్ల మీరు కూడా ఉత్సాహంగా ఉన్నారని భావిస్తున్నాను" అని పేర్కొన్నారు. సహచర వ్యోమగాముల గురించి ప్రస్తావిస్తూ "అంతరిక్షంలోకి రావాలని ఎంతో కాలంగా ఎదురుచూస్తున్నాను. ఇక్కడ ఉన్న వ్యోమగాములు మాకు తలుపులు తెరిచి స్వాగతం పలుకుతుంటే, సొంత ఇంట్లోకి ఆహ్వానించినట్లు అనిపించింది.

ఇది నిజంగా ఒక అద్భుతమైన, కొత్త అనుభూతి. ఇక్కడికి వచ్చే ముందు నాకున్న అంచనాలన్నీ ఇప్పుడు తొలగిపోయాయి. రాబోయే 14 రోజుల పాటు శాస్త్ర పరిశోధనల్లో భాగంగా మీతో కలిసి పనిచేస్తాననే పూర్తి విశ్వాసం నాకు ఉంది" అని శుభాంశు వివరించారు. యాక్సియం-4 మిషన్‌లో భాగంగా ఫాల్కన్-9 రాకెట్ ద్వారా భారత్‌కు చెందిన శుభాంశు శుక్లాతో పాటు అమెరికాకు చెందిన పెగ్గీ విట్సన్, పోలాండ్‌కు చెందిన స్లావోస్జ్ ఉజ్నాన్స్కీ-విస్నీవ్స్కీ, హంగరీకి చెందిన టిబర్ కపు అంతరిక్షంలోకి పయనమయ్యారు. భారత కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నం 12:01 గంటలకు అమెరికాలోని కెన్నడీ అంతరిక్ష కేంద్రం నుంచి వీరి స్పేస్‌క్రాఫ్ట్ నింగిలోకి దూసుకెళ్లింది. గురువారం సాయంత్రానికి ఐఎస్ఎస్‌కు చేరుకుంది. సాయంత్రం 4:03 గంటలకు డాకింగ్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. అనంతరం కొద్దిసేపటికే వ్యోమగాముల బృందం ఐఎస్ఎస్‌లోకి ప్రవేశించింది. ఈ మిషన్‌లో భాగంగా వీరంతా 14 రోజుల పాటు అంతరిక్ష కేంద్రంలో గడిపి, పలు శాస్త్రీయ పరిశోధనలు చేపట్టనున్నారు.

# పార్క్ చుట్టుపక్కల కబ్జా

- ఫుట్ పాత్ కబ్జా వ్యాపారాలపై నెల నెల వసూళ్లు ఎవరివి.?
- ఉదయం నుండి రాత్రి వరకు యదేచ్చగా వ్యాపారాలు రోడ్డుపై పార్కింగ్
- టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించరు, ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోరు



కాప్రా (ప్రశ్న న్యూస్) కాప్రా సర్కిల్ పరిధిలో ఫుట్పాత్ రోడ్ల కబ్జా చాలా జరుగుతున్న పట్టించుకునే నాధుడే కరవయ్యారు. వాహనాధారులకు, పాదాచారులకు ఎన్ని ఇబ్బందులు కలిగిన ఫుట్ పాత్ కబ్జాలను తొలగించడంలో ఇటు ట్రాఫిక్ పోలీసులు, అటు టౌన్ ప్లానింగ్ అధికారులు నిమ్మకు నీరు ఎత్తనట్లు వ్యవహరిస్తున్నారని వాహనాదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మీర్పేట్ హెచ్ బి కాలనీ పార్కు వద్ద ఫుట్ పాత్ ను కబ్జా చేసి యదేచ్ఛగా వ్యాపారాలు నిర్వహించడంతో పార్కుకు వచ్చే పిల్లలకు, వృద్ధులకు, మహిళలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. పార్కు చుట్టుపక్కల ద్విచక్ర వాహనాలు పెట్టుకోకుండా కబ్జా చేసి డబ్బాలు వేయడంతో రోడ్లపై వాహనాలు పెట్టి పార్కులో పిల్లలని ఆడించడం, వాకింగ్ చేయడం జరుగుతుందని రోడ్డుపై వాహనాలు పెట్టడం వల్ల ట్రాఫిక్ జామ్ తో పాటు ట్రాఫిక్ పోలీసులు వచ్చి చలాన్లు వేస్తారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ఉదయం నుండి రాత్రి వరకు టిఫిన్ సెంటర్ గప్చుప్, మిర్చి, బజ్జి ఇతర




వ్యాపారాలు నిర్వహించడంతో రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేసి రోడ్డు జామ్ చేస్తున్నారని అసలే చౌరస్తా కావడంతో చాలా ఇబ్బందులు కలుగుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో అనేక సార్లు టౌన్ ప్లానింగ్ అధికారులకు ట్రాఫిక్ పోలీసులకు స్థానికులు ఫిర్యాదు చేసిన ఈ డబ్బాలను తొలగించకుండా మౌనం వహించడం వెనుక అంతర్యేమిటో ఉన్నత అధికారులకే తెలియాలి. గతంలో టౌన్ ప్లానింగ్ అధికారులకు ఈ ఫుట్ పాత్ వ్యాపారుల నుండి నెలనెల కిరాయిలు వస్తాయని ఈ అక్రమ సంపాదన కోసమే కాప్రా సర్కిల్ పరిధిలో ఫుట్ పాత్ వ్యాపారులను పెంచి పోషిస్తున్నారు టౌన్ ప్లానింగ్ సిబ్బంది, అధికారులు అన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా కాప్రా సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపి కృష్ణమోహన్, డిప్యూటీ కమిషనర్ జగన్ స్పందించి మీర్పేట హెచ్ బి కాలనీ పార్కు చుట్టూ ఉన్న కబ్జాలను తొలగించి పార్కులోకి వచ్చే ప్రజలకు వాహనాలు పార్కింగ్ చేసే విధంగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588